www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

C : 99484 33277 / 9014966169

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 195 | శుక్రవారం | 10 జులై, 2026

తొలిసెట్ ఓడినా..

## పోరాడి గెలిచారు!

- వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్ విజేతగా అరెవాలో–ఒస్టాపెంకో
- తొలి గ్రాండ్‌స్లామ్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌తో చరిత్ర సృష్టించిన రెండో సీడ్ జోడీ
- హంటర్–పోల్మాన్స్‌పై మూడు సెట్లలో అద్భుత విజయం

## తాత.. నువ్వు పూరీలు వేస్తేనే తింటా!

పరిపాలనా బాధ్యతలు.. రాజకీయ వ్యవహారాలతో నిత్యం బిజీబిజీగా ఉండే సీఎం రేవంత్ రెడ్డి.. మనవడి కోసం వంట మనిషిగా మారారు. మనవడు అడగటం.. తాను చేయకపోవడమా.. అంటూ గరిట చేత పట్టారు. వంటగదిలోకి వెళ్లి.. మనవడిని పక్కన పెట్టుకుని పనండైన పూరీలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'తాత.. నువ్వు పూరీలు వేస్తేనే తింటా' అని మనవడు అడిగితే తప్పుతుందా? అంటూ ఆ వీడియోకు క్యాప్షన్ పెట్టారు. దీంతో ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

– ప్రజానావ, హైదరాబాద్

**2036 ఒలింపిక్స్‌కు**

వచ్చే నవంబర్‌లో ఖేలో ఇండియా పోటీలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు భవిష్యత్తులో ఒలింపిక్స్ నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను తెలంగాణలో అభివృద్ధి చేస్తున్నాం. 82 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో స్పోర్ట్స్ యూనివర్సిటీ, ప్రపంచస్థాయి స్పోర్ట్స్ అకాడమీని నిర్మిస్తున్నాం. 2028 డిసెంబరు నాటికి యూనివర్సిటీని ప్రారంభిస్తాం.

– సీఎం రేవంత్ రెడ్డి

# తెలంగాణే వేదికవ్వాలి

### ఆ దిశగా హైదరాబాద్‌ను అన్నివిధాలా సిద్ధం చేస్తున్నాం: సీఎం రేవంత్

- గచ్చిబౌలిలో స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి శ్రీకారం
- ప్రతిభ కనబర్చిన ఆరుగురు క్రీడాకారులకు రూ.7.15 కోట్ల నగదు ప్రోత్సాహకాలు

**ప్రజానావ, హైదరాబాద్:** 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం దక్కితే ఆ క్రీడలకు తెలంగాణ వేదిక కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సర్వసన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి ఆయన గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే నవంబర్‌లో ఖేలో ఇండియా పోటీలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు భవిష్యత్తులో ఒలింపిక్స్ నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను తెలంగాణలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 82 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో స్పోర్ట్స్ యూనివర్సిటీ, ప్రపంచస్థాయి స్పోర్ట్స్ అకాడమీని నిర్మిస్తున్నామని, 2028 డిసెంబరు నాటికి యూనివర్సిటీని ప్రారంభిస్తామని వెల్లడించారు. దేశంలో క్రీడారంగానికి స్పష్టమైన విధానం లేకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయామని పేర్కొన్న సీఎం, తెలంగాణలో సమగ్ర క్రీడా విధానాన్ని రూపొందించామని తెలిపారు. మహాత్మా గాంధీ నడిపిన యంగ్ ఇండియా దినపత్రిక స్ఫూర్తితో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆఫ్రో–ఏషియన్ గేమ్స్, ప్రపంచ మిలిటరీ గేమ్స్, కామన్‌వెల్త్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చిన హైదరాబాద్ గత రెండు దశాబ్దాలుగా పెద్ద క్రీడా టోర్నీలకు దూరమైందని, పాత స్టేడియాలను ఆధునీకరించి మళ్లీ అంతర్జాతీయ స్థాయి క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రభుత్వ జోక్యం లేకుండా పబ్లిక్–ప్రైవేట్ తరువాయి 2లో..

### 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా..

- రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా లక్ష్యంగా ముందుకు
- ఓఆర్ఆర్ లోపల కాలుష్య రహిత అభివృద్ధి
- పరిశ్రమలు పెరి అర్బన్ జోన్లకు తరలింపు
- నెక్ట్–జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభోత్సవంలో సీఎం

2

## నేడు రైతు ఆశీర్వాద సభ

- ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో ఏర్పాట్లు
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రైతు భరోసా తదుపరి విడత నిధులు విడుదల
- రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాలపై వివరణ
- రైతులకు ఆధునిక సాగుపై అవగాహన: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ప్రజానావ, ఖమ్మం:** ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో శుక్రవారం నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు హాజరై రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయాభివృద్ధి చర్యలను రైతులకు వివరించడంతో పాటు రైతు భరోసా పథకం కింద తదుపరి విడత నిధులను విడుదల చేయనున్నారు.సభకు రాష్ట్ర మంత్రివర్గ సభ్యులందరినీ ఆహ్వానించినట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సభకు ముందు జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల మెగా రైతుమేళాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రారంభించారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ సాంకేతికత, ప్రభుత్వ పథకాలు, యాంత్రీకరణ, పంటల నిర్వహణపై అవగాహన కల్పించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. రైతు భరోసా పథకం కింద ఇప్పటికే భారీ మొత్తంలో నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తరువాయి 2లో..



## భగీరథ్‌కు ఊరట

- పోక్సో కేసులో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- విచారణకు సహకరించాలని ఆదేశం

2

## హరీశ్‌రావుపై కేసీఆర్‌కే నమ్మకం లేదు: ఉత్తమ్

# మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు!

### అమెరికా–ఇరాన్ తాజా వైమానిక దాడులతో ఉద్రిక్తతలు తీవ్రం

- కువైట్, బహ్రెయిన్, ఖతార్ వైపు టెహ్రాన్ క్షిపణులు
- యుద్ధ విరమణపై అనిశ్చితి • శాంతి చర్చలకు దెబ్బ.. ట్రంప్, టెహ్రాన్ మధ్య హెచ్చరికల యుద్ధం

**దుబాయ్:** మధ్యప్రాచ్యంలో అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. గురువారం తెల్లవారుజామున అమెరికా ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై వైమానిక దాడులు నిర్వహించగా, ప్రతీకారంగా టెహ్రాన్ అమెరికా మిత్రదేశాలైన కువైట్, బహ్రెయిన్, ఖతార్ దిశగా క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ పరిణామాలు ఇటీవల కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందంపై తీవ్ర అనిశ్చితిని నెలకొల్పాయి. అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) వెల్లడించిన వివరాల ప్రకారం, ఇరాన్‌లోని క్షిపణి ప్రయోగ కేంద్రాలు, సైనిక మౌలిక వసతులు, ఇతర వ్యూహాత్మక ప్రాంతాలను కలిపి మొత్తం 90 లక్ష్యాలపై వైమానిక దాడులు నిర్వహించారు. హార్మూజ్ జలసంధిలో నౌకాయాన భద్రతకు ముప్పు కలిగించే ఇరాన్ సామర్థ్యాన్ని మరింత బలహీనపరచడమే ఈ దాడుల ఉద్దేశమని అమెరికా పేర్కొంది. ఇరాన్ ఆరోగ్యశాఖ ప్రకారం, రెండు రోజుల అమెరికా దాడుల్లో కనీసం 14 మంది మరణించగా, 78 మంది గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది భద్రతా దళాలకు చెందినవారేనని తెలిపింది.

#### ప్రతీకారంగా క్షిపణుల వర్షం

అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కువైట్, బహ్రెయిన్, ఖతార్, జోర్డాన్ వైపు క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. కువైట్ మూడు బాలిస్టిక్ క్షిపణులు, ఒక క్రూయిజ్ క్షిపణి, పది డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రకటించింది. బహ్రెయిన్, జోర్డాన్‌లు కూడా తమ వైమానిక రక్షణ వ్యవస్థలతో అన్ని దాడులను తిప్పికొట్టినట్లు వెల్లడించాయి. క్షిపణి శకలాలు తరువాయి 2లో..

## బీఆర్ఎస్ ఖాతాలోని రూ.1,400 కోట్లు పంచాలి

- అవన్నీ క్విడ్ ప్రోకో ద్వారా వచ్చిన నిధులే
- తిరిగి ఆ పార్టీలో చేరేదే లేదు
- బీఆర్ఎస్‌పై టీఆర్ఎస్ చీఫ్ కవిత తీవ్ర విమర్శలు
- సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్

2

## వికసిత్ భారత్ లక్ష్యంగా వేగంగా అడుగులు

- గ్రో మోర్, అచీవ్ మోర్ స్ఫూర్తితో ముందుకు
- మెల్‌బోర్న్‌లో భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ

2

## భారత్‌కు తొలి హైడ్రోజన్ రైలు

- ఈ నెల 17న జింద్‌లో ప్రారంభించనున్న ప్రధాని మోదీ • హరియాణాలో వేల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- వైద్యం, రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు ఊతం

2

## బీఎంఎస్ పోరాట ఫలితంగానే
# తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ సింగరేణికి దక్కింది

- 12వ వేతన కమిటీపై నోటిఫికేషన్ ఇవ్వకపోతే ఆగస్టు 17 నుంచి ఆందోళనలు
- బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య

**ప్రజానావ, మంచిర్యాల:** బీఎంఎస్ నిరంతర పోరాటం, కేంద్ర ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తుల ఫలితంగానే తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించబడిందని బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ ఓసీపీ ప్రాజెక్టులో కార్మికులతో కలిసి బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, బీఎంఎస్ నాయకులు, కోల్ మైన్స్ అధికారులు, కార్మిక సంఘం ప్రతినిధులతో కలిసి తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని కోరినట్లు తెలిపారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు క్రమంగా తగ్గిపోతుండటంతో భవిష్యత్తులో గనులు మూతపడే ప్రమాదం ఉందని, వేలాది మంది కార్మికుల ఉపాధి దెబ్బతినే పరిస్థితిని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తాడిచర్ల–2 బ్లాక్‌లో సుమారు 277 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, సింగరేణి అనుభవం, ఆధునిక సాంకేతికత, మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని ఈ కేటాయింపు సంస్థ భవిష్యత్తుకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాగే కోలిండియా యాజమాన్యం లేబర్ కోడ్‌ల అమలులో చూపుతున్న చొరవను బొగ్గు గని కార్మికుల 12వ వేతన కమిటీ ఏర్పాటు కోసం నోటిఫికేషన్ జారీ చేయడంలో కూడా చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆగస్టు 17 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి రాజారామ్, కిరణ్‌కుమార్, తిరుపతి, సాగర్, నాగార్జున, సురేష్, ఫిట్ కార్యదర్శి శనిగారపు శ్రీనివాస్, వెంకటేష్, విష్ణు, శ్రీరాములు, రాజేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ

- రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా లక్ష్యంగా ముందుకు
- ఓఆర్ఆర్ లోపల కాలుష్య రహిత అభివృద్ధి
- పరిశ్రమలు పెరి అర్బన్ జోన్లకు తరలింపు
- సీఎం రేవంత్‌రెడ్డి
- సీతారాంపూర్‌లో నెక్ట్–జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభం

**ప్రజానావ, హైదరాబాద్:** 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్‌లో ఏర్పాటు చేసిన ఇండియన్ నెక్ట్–జెన్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించేందుకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పరిశ్రమలకు అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తున్నామని చెప్పారు. ప్రతి ఏడాది రాష్ట్రంలో 1.10 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టభద్రులు బయటకు వస్తున్నందున వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కొత్త పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. యువతలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేశామని, ముఖ్యంగా బ్లూ కాలర్ ఉద్యోగాలకు అవసరమైన ప్రత్యేక నైపుణ్యాలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. హైదరాబాద్‌ను దేశంలోనే అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా తీర్చిదిద్దాలంటే కాలుష్య నియంత్రణ అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం ఓఆర్ఆర్ పరిధిలో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని, అందువల్ల ఓఆర్ఆర్ లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను పెరి అర్బన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక మాన్యుఫాక్చరింగ్ జోన్లకు తరలించే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు ఎదుర్కొంటున్న కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు హైదరాబాద్‌లో తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

### క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజన

రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజించి సమతుల అభివృద్ధికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. రాజకీయ విమర్శలు సహజమే అయినప్పటికీ రాష్ట్ర అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు. అధికారం కోల్పోయిన బాధతో అభివృద్ధిని అడ్డుకోవద్దని, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీతారాంపూర్‌లో సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు అందించడంతో పాటు ఉపాధి కల్పన కోసం వ్యాపార సముదాయాలు నిర్మించి ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. అలాగే చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని, బుద్వేల్–కొడంగల్ మధ్య 100 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణం కొనసాగుతోందని వెల్లడించారు.

## భారత్‌కు తొలి హైడ్రోజన్ రైలు
### 17న జింద్‌లో ప్రారంభించనున్న ప్రధాని మోదీ

**చండీగఢ్:** దేశంలోనే తొలి హైడ్రోజన్ ఇంధనంతో నడిచే రైలును ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 17న హరియాణాలోని జింద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల విలువైన పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా ప్రారంభించి, శంకుస్థాపనలు చేయనున్నట్లు హరియాణా మంత్రి కృష్ణ కుమార్ బేడీ గురువారం తెలిపారు. ప్రధాని మోదీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అలాగే వర్చువల్ విధానంలో భివానీ, నర్నౌల్‌లలో శ్రీరామ్ వైద్య కళాశాలలు, కురుక్షేత్ర ఎలివేటెడ్ రైల్వే ట్రాక్, అంబాలా–కాలా అంబ్ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్, ఢిల్లీ–కత్రా ఎక్స్‌ప్రెస్‌వే హరియాణా విభాగం, జింద్–గోహానా ఎన్‌హెచ్–352ఏ తదితర కీలక ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. కురుక్షేత్రలో సిక్కు మ్యూజియానికి శంకుస్థాపన చేయడంతో పాటు పలు జాతీయ రహదారుల విస్తరణ పనులకు కూడా శ్రీకారం చుట్టనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో వైద్య సేవలు, రహదారి అనుసంధానం మరింత మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని బేడీ పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ ఖాతాలోని
# రూ.1,400 కోట్లు పంచాలి

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం:** బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ఉన్న రూ.1,400 కోట్లను తెలంగాణ అమరుల కుటుంబాలకు పంపిణీ చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆ నిధులు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చినవి కాదా అని ప్రశ్నించారు. బోయిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం కొత్తగూడెంలో పర్యటించిన ఆమె మీడియాతో మాట్లాడారు.తమ పార్టీతో భయం లేదని చెబుతూనే ఎన్నికల సంఘానికి వెయ్యికి పైగా ఫిర్యాదులు చేశారని ఆరోపించారు. టీఆర్ఎస్ పేరు తనకు రాకుండా కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. తల్లి, చెల్లి అనే సభ్యత కూడా మరిచి బీఆర్ఎస్ సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని మండిపడ్డారు. తన ప్రాణం ఉన్నంత వరకు తిరిగి బీఆర్ఎస్‌లో చేరబోనని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి తన ప్రజా పోరాటాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని కవిత ఆరోపించారు. ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు క్విడ్ ప్రోకో కింద అక్రమ అనుమతులు ఇచ్చారని, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో హరీశ్‌రావు కీలక పాత్ర పోషించారని విమర్శించారు. బీఆర్ఎస్ ఇంకా అదే నాయకత్వాన్ని ముందుకు తెస్తోందని, ఆ పార్టీ తిరిగి అధికారంలోకి రాదని వ్యాఖ్యానించారు. ఇటీవల రూ.188 కోట్లతో ఒక ఇంగ్లిష్ పత్రికను కొనుగోలు చేశారని, ఫినిక్స్ సంస్థకు రూ.80 వేల కోట్ల విలువైన భూములు కేటాయించారని, ఆ సంస్థ భారీ స్థాయిలో కలపను తరలిస్తోందని ఆరోపించారు. సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20 నుంచి గోదావరిఖనిలో నిరాహార దీక్ష చేపడతా మని ప్రకటించారు.సింగరేణికి రావాల్సిన బకాయిల ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలంటే నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా రాష్ట్ర శాసనసభలో తీర్మానం చేయాలని సూచించారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా నామమాత్రపు జీతాలు చెల్లిస్తున్నారని కవిత ఆరోపించారు.

# ట్రంప్ మెడకు లైంగిక వేధింపుల కేసు

- దోషిగా తేల్చిన అమెరికా ఫెడరల్ కోర్టు
- కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆదేశం

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో న్యాయపరమైన ఎదురుదెబ్బ తగిలింది. లైంగిక వేధింపుల సులో ట్రంప్‌ను అమెరికా ఫెడరల్ కోర్టు దోషిగా తేల్చింది. రచయిత్రి, మాజీ కాలమిస్టు జీన్ క్యారల్‌కు 5 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే దాదాపు రూ.47 కోట్లు చెల్లించాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశించింది. 2023లో విచారణ జరిపిన జ్యూరీ, ట్రంప్ లైంగిక దాడికి పాల్పడినట్లు, అనంతరం క్యారల్ పరువును దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసినట్లు తేల్చింది. దీంతో 5 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాలని అప్పుడే తీర్పు వెలువరించింది. లైంగిక దాడికి గాను 2 మిలియన్ డాలర్లు, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు గాను 3 మిలియన్ డాలర్లు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశిస్తూ మే 2023లో కోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ట్రంప్ చేసిన అప్పీలును విచారించడానికి గత వారం అమెరికా సుప్రీంకోర్టు నిరాకరించింది. 1996లో న్యూయార్క్‌లోని ఒక డిపార్ట్‌మెంట్ స్టోర్‌లోని డ్రెస్సింగ్ రూంలో తనపై ట్రంప్ లైంగిక దాడి చేశారని క్యారల్ ఆరోపించారు. ఆ విషయాన్ని 2019లో ప్రచురితమైన ఓ పుస్తకంలో క్యారల్ రాశారు. ఆ ఆరోపణలు పూర్తిగా కల్పితమని, క్యారల్ ఒక పిచ్చిదని ట్రంప్ కొట్టిపడేశారు. కాగా, ఇది ట్రంప్‌కు సంబంధించిన ఏకైక సివిల్ సు కాదు. 2024లో పరువు నష్టం సులో క్యారల్‌కు అదనంగా 83.3 మిలియన్ డాలర్లు చెల్లించాలని మరో జ్యూరీ తీర్పు ఇచ్చింది. ఆ సు డా ప్రస్తుతం న్యాయపరమైన పక్రియలో కొనసాగుతోంది.

## బండి భగీరథ్‌కు షరతులతో కూడిన బెయిల్
### దర్యాప్తుకు సహకరించాలని హైకోర్టు ఆదేశం

**ప్రజానావ, హైదరాబాద్ :** ంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కు ఊరట లభించింది. పోక్సో సులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో డిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం.. దర్యాప్తునకు సహకరించాలని బండి భగీరథ్‌ను ఆదేశించింది. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో అతడిపై పోక్సో సు నమోదైంది. మే 16న పోలీసులు అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ భగీరథ్ విద్యార్థి అని, 45 రోజులకుపైగా జైలులో ఉండటంతో జీవితంలో చాలా కోల్పోయాడ న్నారు. పరస్పర అంగీకారంతో జరిగిన దానిపై సులు నమోదు చేయడం చెల్లదని.. ఇదే విషయాన్ని హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు తీర్పుల్లో వెల్లడించాయన్నారు. బెయిల్ మంజూరు చేస్తే కోర్టు విధించిన షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన వెంటనే వాంగ్మూలాల సేకరణ మొదలైందన్నారు. దర్యాప్తు దాదాపు పూర్తికావచ్చిందని, గదువులోగా అభియోగ పత్రాన్ని దాఖలు చేస్తామన్నారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

## వికసిత్ భారత్ లక్ష్యంగా వేగంగా అడుగులు

**మెల్‌బోర్న్:** గ్రో మోర్, అచీవ్ మోర్ (మరింత ఎదగండి.. మరింత సాధించండి) అనే లక్ష్యంతో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశం కలలు కనే ప్రతి విజయానికి ప్రజలే బలమైన పునాదని, పౌరుల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు మార్గదర్శక సూత్రమ ని స్పష్టం చేశారు. ఆస్ట్రేలియాలో నిర్వహించిన మెల్‌బోర్న్ మీట్స్ మోదీ కార్యక్రమంలో ఆ దేశ ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి పాల్గొన్న మోదీ, భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్య, నైపుణ్యాలు, ఆవిష్కరణల రంగాల్లో భారత్–ఆస్ట్రేలియా భాగస్వామ్యం మరింత బలపడుతోందని తెలిపారు. 21వ శతాబ్దపు భారత్ వికసిత్ భారత్ లక్ష్యంతో ముందుకు సాగుతోందని మోదీ అన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ, త్వరలోనే ప్రపంచ తొలి మూడు ఆర్థిక శక్తుల్లో ఒకటిగా నిలవాలన్నదే దేశ లక్ష్యమని చెప్పారు. ఒక లక్ష్యం నెరవేరగానే మరో లక్ష్యాన్ని నిర్దేశించుకునే దేశం భారత్ అని వ్యాఖ్యానించారు.

### స్టార్టప్‌లు, సాంకేతికతలో పరుగులు

భారత్ ప్రస్తుతం ప్రపంచంలో రెండో అతిపెద్ద 5జీ మార్కెట్‌గా ఎదిగిందని, మేడ్ ఇన్ ఇండియా 6జీ సాంకేతికతపై వేగంగా పనిచేస్తోందని ప్రధాని తెలిపారు. దేశంలో రెండు లక్షలకు పైగా నమోదైన స్టార్టప్‌లు ఉన్నాయని, ప్రతి నెలా నాలుగు వేలకుపైగా కొత్త స్టార్టప్‌లు ప్రారంభమవుతున్నాయని చెప్పారు. చిప్స్ నుంచి నౌకల తయారీ వరకు విస్తరించిన కొత్త తయారీ పర్యావరణ వ్యవస్థ దేశంలో రూపుదిద్దుకుంటోందని వెల్లడించారు. చంద్రయాన్ విజయాన్ని ప్రస్తావించిన మోదీ, చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందన్నారు. ఇప్పుడు గగన్‌యాన్ మిషన్‌తో పాటు స్వంత అంతరిక్ష కేంద్రం నిర్మాణ దిశగా కూడా దేశం అడుగులు వేస్తోందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత రక్షణ సామర్థ్యాన్ని ప్రపంచం ప్రత్యక్షంగా చూసిందని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాద స్థావరాలపై జరిగిన కచ్చితమైన దాడులతో దేశ సత్తా చాటుకున్నామని, ఆ చర్యలపై ప్రతి భారతీయుడు గర్వపడాలని అన్నారు.

#### భారత్–ఆస్ట్రేలియా సంబంధాలు మరింత బలోపేతం

గత 12 ఏళ్లలో ఆస్ట్రేలియాకు ఇది తన మూడో పర్యటన అని గుర్తు చేసిన మోదీ, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంలో భారతీయ ప్రవాసుల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. క్రీడలు, విద్య, పరిశోధన రంగాల్లో ఇరు దేశాల సహకారం మరింత విస్తరించనున్నదని విశ్వాసం వ్యక్తం చేశారు. కామన్వెల్త్ క్రీడలు–2030, ఒలింపిక్స్–2036 ఆతిథ్య హక్కుల కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలను కూడా ఆయన ప్రస్తావించారు.

# హరీశ్‌రావుపై కేసీఆర్‌కే నమ్మకం లేదు

- ఇరిగేషన్‌లో నిష్ణాతుడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తొలగించారని ప్రశ్న
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులు వచ్చే వేసవిలోగా పూర్తి చేస్తాం: హరీశ్
- ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం.. రైతులు ఆందోళన చెందొద్దని భరోసా

**ప్రజానావ, హైదరాబాద్:** మాజీ మంత్రి హరీశ్‌రావు పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే నమ్మకం లేకపోవడం తోనే తొలిదశలో ఆయనను ఇరిగేషన్ శాఖ మంత్రి పదవి నుంచి తొలగించారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఇరిగేషన్‌లో హరీశ్‌రావు అంతటి నిష్ణాతుడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తప్పించారని ప్రశ్నించారు. గురువారం సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని వ్యాఖ్యానిస్తున్నారని, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారా అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎదురు ప్రశ్నించారు. హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలకు తగిన సమయంలో సమగ్రంగా సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు వచ్చే వేసవిలోగా పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. దెబ్బతిన్న నిర్మాణాలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు.

#### రైతులు ఆందోళన చెందొద్దు

అనంతరం ఎల్‌నినో ప్రభావంపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లాల వారీగా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని చెప్పారు. గ్రామసభల ద్వారా ఎల్‌నినోపై అవగాహన కల్పిస్తామని, శాస్త్రవేత్తల సూచనలకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు సలహాలు అందిస్తామని తెలిపారు. రిజర్వాయర్లలో నీటి లభ్యత, సాగునీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రతి జిల్లాలో నిరంతర సమీక్షలు నిర్వహిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తామని, వదంతులను నమ్మకుండా అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ రైతు సంక్షేమానికే ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వర్చువల్ విధానంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## 2036 ఒలింపిక్స్‌కు తెలంగాణే వేదికవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

భాగస్వామ్యంతో స్పోర్ట్స్ యూనివ ర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సంజయ్ గోయంకా, అభినవ్ బింద్రా, కపిల్ దేవ్, కావ్యా మార న్, ఉపాసన కొణిదెల, రవికాంత్‌రెడ్డి తదితరులు యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములు కానున్నారని వెల్లడించారు.

### ఓటమిని సవాల్‌గా స్వీకరించాలి

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు పిలుపునిచ్చిన సీఎం, దేశానికి కీర్తి తీసుకొచ్చే క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. విజయం సాధించాలంటే ఏకాగ్రత, నిరంతర సాధన అవసరమని, ఓటమిని సవాల్‌గా స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు. ఈ సంద ర్భంగా వివిధ అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబర్చిన తెలంగాణకు చెందిన ఆరుగురు క్రీడాకారులకు మొత్తం రూ.7.15 కోట్ల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అలాగే 2026 ఖేలో ఇండియా యూత్ గేమ్స్, జాతీయ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌తో పాటు హాకీ ఇండియా లీగ్, ప్రపంచ పికిల్‌బాల్ లీగ్, ఆర్చరీ ప్రీమియర్ లీగ్, టెన్నిస్ ప్రీమియర్ లీగ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ నాలెడ్జ్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు.

## నేడు ఖమ్మంలో రైతు ఆశీర్వాద సభ

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకో వాలని సూచించారు. తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే పంటలు, ఆరుతడి పంటలు, పప్పుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తగ్గడంతో సీతారామ ప్రాజెక్టు, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, ఎరువుల సరఫరా, పంటల సలహాలు, సాంకేతిక సేవలను మరింత సమర్థంగా అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించా రు. రైతులకు వాతావరణ సమాచారం, యూరియా పంపిణీ వంటి సేవలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందిస్తున్నామని తెలిపారు.

# మధ్యప్రాచ్యంలో మళ్లీ మంటలు!

(మొదటిపేజీ తరువాయి)

పడటంతో కువైట్‌లో ఒకరు గాయపడినట్లు అధికారులు తెలిపారు.

#### ట్రంప్ హెచ్చరిక.. ఇరాన్ కౌంటర్

హోర్ముజ్ జలసంధిలో నౌకలపై దాడులు కొనసాగితే మరింత తీవ్ర ప్రతీకార చర్యలు తప్పవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అవసరమైతే ఇరాన్ విద్యుత్, డీసాలినేషన్ ప్లాంట్లు, ఖార్గ్ చమురు టెర్మినల్‌ను కూడా లక్ష్యంగా చేసుకుంటామని పేర్కొన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం దాదాపు ముగిసినట్టేనని వ్యాఖ్యానిస్తూ, చర్చలు కొనసాగుతున్నప్పటికీ వాటిపై ఆశలు తగ్గాయని చెప్పారు. అమెరికా బెదిరింపులకు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘర్ ఖలీబాఫ్ ఘాటుగా స్పందించారు. దాడి చేస్తే ప్రతిదాడి తప్పదు అని స్పష్టం చేశారు. విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి సౌదీ అరేబియా, టర్కీ, ఒమన్, పాకిస్థాన్ నాయకులతో ఫోన్‌లో చర్చలు జరిపి ఉద్రిక్తతలు తగ్గించే ప్రయత్నాలు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇదిలాఉంటే యుద్ధానికి శాశ్వత ముగింపు పలికే లక్ష్యంతో త్వరలో ప్రారంభం కావాల్సిన చర్చలపై తాజా దాడులు తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమంపై పరిమితులు వంటి కీలక అంశాలపై జరగాల్సిన చర్చలు మరింత సంక్లిష్టంగా మారే పరిస్థితి నెలకొంది.

# వనపర్తి అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- గోపాల్‌పేట మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం
- రూ.60 కోట్లతో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు
- ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** వనపర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధితో పాటు రైతులు, మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం గోపాల్‌పేట మండల కేంద్రంలోని బుద్ధారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉమ్మడి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎక్కే వెంకటేష్, వైస్ చైర్మన్‌గా సత్యశీలారెడ్డి, డైరెక్టర్‌

# రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- భూ సమస్యల పరిష్కారానికి అటవీ–రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** ఏళ్ల తరబడి భూ సమస్యలు పరిష్కారం కాక రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను నిలదీశారు. కొల్లాపూర్ మండలం సోమశిలలో గురువారం అటవీ, రెవెన్యూ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావే శంలో ఆయన రైతుల భూ సమస్యల పై ఆరా తీశారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల రైతులు నష్టపోకూడదని స్పష్టం చేసిన మంత్రి, వివాదాస్పద భూములపై సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి భూ రికార్డులు, అటవీ సరిహద్దులు, రైతుల సాగు ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించా రు. పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసి రైతులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పే పరిస్థితి రాకుండా చూడాలని హెచ్చరించారు. కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల గ్రామాల వారీగా రైతుల సమస్యలను మంత్రి స్వయంగా విని, ప్రతి కేసు ఏ దశలో ఉందో అధికారులను అడిగి తెలుసుకు న్నారు. పోడు భూములు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, సర్వే నంబర్ల వివాదాలు, రికార్డుల లోపాలు, సరిహద్దు సమస్యల ను ఒక్కొక్కటిగా సమీక్షించి అర్హులైన రైతులకు చట్టబద్ధంగా న్యాయం చేయాలని ఆదేశించారు. అధికారులు ప్రజల సమస్యలను ఫైళ్లకే పరిమితం చేయకుండా మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హేమం త్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచ రణతో ముందుకు సాగుతోందన్నారు. రైతులు తమ వద్ద ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలు, పాత పట్టాలు, సర్వే నంబర్లు, ఇతర భూ రికార్డులను సంబంధిత ఆర్డీవో కార్యాలయానికి అందించాలని సూచించారు. అటవీ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వేలు నిర్వహించి అర్హులైన రైతుల భూములను భూభారతి పోర్టల్‌లో నమోదు చేసి చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్లు, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# జీపీలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో మూడేళ్ల కార్యాచరణ రూపొందించాలి
- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజానావ, మెదక్:** గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాల ని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై మెదక్ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను వినియోగించుకుని పంచాయతీల ఆదాయాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని, ఆర్థికంగా బలోపేతం అయినప్పు డే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, గ్రామ సభల్లో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ రాబోయే మూడు సంవత్సరాలకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, ఏడు ప్రధాన అంశాలపై కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచే ప్రారంభం కావాలని, తడి, పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేలా ప్రజల్లో అవగాహన కల్పించాల ని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. జీ రామ్ జీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పించాలని, మహిళా సంఘాల కోసం నిర్మిస్తున్న వీఓ భవనాల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు అయ్యేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి విద్యారావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, మిషన్ భగీరథ ఈఈ సంపత్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పీటీజీ గురుకులంలో ఫుడ్ పాయిజన్ కలకలం

- 25 మంది విద్యార్థులు అస్వస్థత
- అచ్చంపేట ఆసుపత్రికి తరలింపు

**ప్రజానావ, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని పీటీజీ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం ఫుడ్ పాయిజన్ కలకలం రేగింది. అల్పాహారం తీసు కున్న కొద్దిసేపటికే 25 మంది విద్యార్థులు అస్వస్థ తకు గురికావడంతో వారిని తొలుత మన్ననూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యా యులు వెంటనే స్పందించి విద్యార్థులను ఆసుపత్రికి తరలించడంతో వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అయితే ఈ ఘటనకు కారణాలు ఇంకా నిర్ధారణ కాలేదని, నీటి కాలుష్యం కూడా ఒక కారణం కావచ్చని వైద్యులు ప్రాథమి కంగా అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో బోరు నీటిని వినియోగిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన వెంటనే వైద్యం అందించామని, ప్రస్తుతం అందరూ కోలుకుంటున్నారని చెప్పారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

- రూ.50 లక్షలతో గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన
- కంట్టి పీహెచ్‌సీని పరిశీలించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజానావ, సంగారెడ్డి:** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలతో పాటు విద్యా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గురువారం నారాయణఖేడ్ నియోజకవ ర్గంలో పర్యటించిన మంత్రి, స్థానిక ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డితో కలిసి సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న శాఖ గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. గ్రామీణ యువత, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమైన ఆధునిక వసతులు కల్పించేలా గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కంట్టి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి, ఓపీ, ఐపీ విభాగాలు, ఔషధ నిల్వలు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి కంట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, నిజాంపేట పీహెచ్‌సీని 24×7 ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# దళితులపై దౌర్జన్యాలు సహించం

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలు, కులం పేరుతో చేసే దూషణలను ఎంతమాత్రం సహించబోమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వనపర్తి జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు హెచ్చరించారు. మండల పరిధిలోని బాధితుడు తగరం వెంకటస్వామిని వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం పరామర్శించి, కుటుంబ సభ్యులకు తమ సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా కొమ్ము చెన్నకేశ వులు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దళితులపై వివక్ష కొనసాగడం బాధాకర మన్నారు. బాధితుడిపై దాడి చేసిన వారిపై నమోదైన అట్రాసిటీ కేసును అధికారులు నీరుగార్చే ప్రయత్నం చేస్తే చట్టపరంగా ఉన్నత న్యాయస్థానాలు, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అట్రాసిటీ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ అండతో దళిత నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి వారి గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిం చారు. దళితులకు అండగా ఉండాల్సిన ప్రజాప్రతిని ధులే నిందితులకు మద్దతు ఇవ్వడం బాధాకరమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి, నాగర్‌క ర్నూల్ జిల్లాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు, చిన్నంబావి మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలే లక్ష్యంగా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు

- గ్రామ పంచాయతీల స్వయం సమృద్ధికి కార్యాచరణ రూపొందించాలి
- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఆలేరు, రాజపేట, యాదగిరిగుట్ట, బొమ్మలరామారం, తుర్కపల్లి, ఆత్మకూర్ (ఎం), మోటకొండూరు, గుండాల, అడ్డగూడూరు, మోత్కూరు మండలాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారుల కోసం నిర్వహిం చిన వర్క్‌షాప్‌లో గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన కార్యాచరణపై మార్గదర్శకాలు వివరించారు. ప్రజాప్రతినిధులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సరిత, జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల రాష్ట్రానికే ఆదర్శం

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- టాప్ 31 మంది విద్యార్థులకు ఐప్యాడ్‌లు పంపిణీ
- వచ్చే ఏడాది 50 మందికి అందజేస్తానని హామీ

**ప్రజానావ, సిద్దిపేట:** సిద్దిపేటలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోం దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్ రావు అన్నారు. గురువారం పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల 31 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో ఐప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమా న్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల తనకు ఎంతో ఆత్మీయమైనదని, ఈ పాఠ శాల రాష్ట్రంలోనే ఉత్తమ విద్యాసంస్థగా ఎదగడంలో ప్రధానోపాధ్యాయుడు రాజప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యా యుల కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 1,234 మంది విద్యార్థులు చదువుతు న్నారని, తెలంగాణలో అత్యధిక విద్యార్థులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఇది రెండో స్థానంలో నిలిచింద న్నారు. పాఠశాలలో ప్రవేశాల కోసం ముఖ్యమంత్రి కార్యాలయం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి కూడా సిఫార్సులు వస్తుండటం ఈ విద్యాసం స్థపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొ న్నారు. స్థలాభావం కారణంగా విద్యార్థుల సంఖ్యను పరిమితం చేయాల్సి వస్తోందని, త్వరలో అదనపు తరగతి గదులు నిర్మించి పాఠశాలను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు టాప్–30 మంది విద్యార్థులకు ఐప్యాడ్‌లు ఇవ్వాలని నిర్ణయించగా, సమాన మార్కు లు రావడంతో మొత్తం 31 మందికి అందజేసినట్లు తెలిపారు. వచ్చే ఏడాది టాప్–50 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఐప్యాడ్‌లు అందజేస్తానని ప్రకటించారు. ఐప్యాడ్‌లలో ఇంటర్నెట్ సౌకర్యం లేకుండా కేవలం విద్యా సంబంధిత స్టడీ మెటీరియల్, ఇంటర్మీడియట్ సమాచారం, జనరల్ నాలెడ్జ్ మాత్ర మే అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలు, గేమ్‌లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా వారికి పూర్తి సహకారం అందించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన అన్ని విధాలుగా తన సహకారం కొనసాగుతుందని హరీశ్ రావు హామీ ఇచ్చారు.

# గ్రామాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

- ఇందిరమ్మ గృహాల అర్హుల జాబితాను పారదర్శకంగా పరిశీలించాలి
- పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజానావ, పెద్దపల్లి ప్రతినిధి :** గ్రామాల అవసరాలకు అనుగుణంగా ప్రతి గ్రామపంచాయతీ మూడేళ్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం గ్రామపంచాయతీలకు అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ వనరులను గుర్తించి పంచాయతీల ఆదాయాన్ని పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని, ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే గ్రామాభివృద్ధి మరింత వేగంగా సాగుతుందని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని, ప్రతి ఇంటి నుంచే తడి, పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని, ఉపాధి హామీ పథకం కింద అర్హులైన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల కోసం నిర్మిస్తున్న వీఓ భవనాల పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. ఇందిరమ్మ కమిటీ ప్రతిపాదించిన గృహాల అర్హుల జాబితాను గెజిటెడ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఎంపీడీవోలు సమన్వయ బాధ్యతలు చేపట్టి గృహాల ధృవీకరణను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు

# రూ.5 వేల పింఛన్ ఇవ్వాలి

- సంక్షేమ బోర్డు ద్వారా మెరుగైన సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** భవన నిర్మాణ కార్మికులకు 50 ఏళ్ల పూర్తయిన తర్వాత సంక్షేమ బోర్డు ద్వారా నెలకు రూ.5 వేల పింఛన్ అందించాలని ఏఐటీయూసీ నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు. బిజినపల్లి మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపాగా శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ఏఐటీయూసీ జిల్లా మూడో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న భవన నిర్మాణ కార్మికులను చిన్నచూపు చూడొద్దన్నారు. కార్మిక కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, పిల్లలకు ఉచిత విద్య, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. సహజ మరణం చెందిన కార్మికుడి కుటుంబానికి ఇచ్చే పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, మ్యారేజ్ గిఫ్ట్‌ను రూ.30 వేల నుంచి రూ.లక్షకు, ప్రసవ కానుకను కూడా రూ.లక్షకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి మండల కేంద్రంలో లేబర్ అడ్డాలను ఏర్పాటు చేసి, కార్మికులకు సబ్సిడీపై మోటార్ సైకిళ్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు డి. లక్ష్మయ్య, కార్యదర్శి వెంకట్రాములు, నాయకులు నాగయ్య, రఫిక్, లక్ష్మణ్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

# 18లోపే ఎన్యూమరేషన్ పత్రం నింపి ఇవ్వాలి

- ఎన్యుమరేషన్ ఫారం చివరి రోజుల్లో ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయాలంటే సర్వర్ కూడా బిజీ ఉండి అప్డేట్ కానట్లయితే ఓటు గల్లంతే!: సిరిసిల్ల ఆర్డీవో, ఈఆర్వో డా. డీ శ్రీధర్ బాబు

**ప్రజానావ, సిరిసిల్ల :** ఈనెల 18వ తేదీ లోపే ఓటర్ల పెన్యుమరేషన్ ఫారాలు పూరించి ఇవ్వాలని సిరిసిల్ల రెవెన్యూ డివిజనల్ అధికారి, నియోజకవర్గ ఈఆర్ఓ డా. డి. శ్రీధర్ బాబు కోరారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేస్తూ ఓటర్ల గడువు చివరి రోజులలో ఇచ్చిన ఎన్యూమ రేషన్ ఫారాలను ఆన్లైన్లో అప్డేట్ చేయాలంటే సర్వర్లు బిజీ గా ఉండి అప్డేట్ కాని పక్షంలో ఓటు గల్లంతు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలా ఓటు కోల్పోయిన వారు ముసాయిదా జాబితా ప్రకటించిన ఈ నెల 31 తర్వాత ఫారం–6 ద్వారా కొత్త ఓటరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్యూమరేషన్ పత్రం అందకపోతే ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్‌లో మీ పోలింగ్ బూత్‌కు సంబంధించిన బీఎల్ఓ నంబరుకు ఫోన్ చేస్తే పత్రాన్ని తీసుకొచ్చి ఇస్తారన్నారు. బీఎల్ఓలు స్పందించని పక్షంలో నియోజవర్గం హెల్ప్ లైన్ నెంబర్ గోపకృష్ణ 91 92902 91666, ఈఆర్ఓ నంబరుకు ఫిర్యాదు చేయొచ్చనీ వెల్లడించారు. ఎస్ఐఆర్–2002లో ఓటు ఉన్నవారు మొదటి బాక్సు కాలమ్‌లో నింపాలని, 2002లో ఓటు లేనివారు వారి తండ్రి, తల్లి, తాత, నాయన మ్మల్లో ఒకరిది ఎస్ఐఆర్–2002 వివరాలను రెండో బాక్సు కాలమ్‌లో నింపాలని, ఈ రెండూ తెలియని వారు మూడో బాక్సు కాలమ్ పూరించాలన్నారు. ఈ నెల 31 తర్వాత ముసాయిదా నోటిఫికేషన్ సమయంలో చిరునామా మార్పు కోసం ఫారం–8 నింపి ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రాంత ఈఆర్ఓకు సమర్పించవచ్చన్నారు. ఎస్ఐఆర్ –2002లో పాత జిల్లాలు, నియోజకవర్గాలే వస్తాయి. ఆ వివరాలే నింపాలి. రాష్ట్రం కాలమ్‌లో ఆంధ్రప్రదేశ్ ఉంటుంది. పొరపాటున తెలంగాణ అని రాసినా ఇబ్బందేమీ లేదని స్పష్టం చేశారు. విదేశీ పౌరసత్వం ఉంటే ఇక్కడ ఎన్యూమరేషన్ పత్రం నింపొద్దని, ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటు ఉంటే ఏదైనా ఒక ప్రాంతమే ఎంచుకోవాలి. రెండుచోట్లా ఇస్తే.. చట్టప్రకారం చర్యలు ఉంటాయని ప్రకటించారు. ఎన్యూమరేషన్ పత్రాలతో కలిపి ఎలాంటి ధ్రువపత్రాలు ఇవ్వాల్సిన పని లేదని, మీ పత్రంపై అనుమానాలుంటే ఈఆర్వో నోటీసులు అందిస్తారు. ఆ సమయంలో అధికారులు అడిగిన పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని ఆర్డిఓ విఆర్ఓ వెల్లడించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జిలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
9948433277, 9014966169

## గందరగోళంలో వ్యవసాయం

**ప్రకృతి వైపరీత్యాలు, పెరుగుతున్న పెట్టుబడులు, నకిలీ విత్తనాల మోసం, ఎరువుల కొరత, పంటలకు మద్దతు దక్కకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. రైతుకు ప్రకృతి శాపంగా మారుతోంది. ఒకవైపు కరవు, మరోవైపు ఆకాల వర్షాలు, వరదలు, వడగండ్ల వానల కారణంగా పంటలు నాశనమవుతు న్నాయని అనుకుంటే ఇప్పుడు ఎల్‌నినో వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు అనిశ్చితంగా మారింది. ప్రకృతి వైపరీత్యాల నుంచి మొదలై మార్కెట్ మాయాజాలం వరకు ప్రతి ఒక్కటి రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి.**

ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఆందోళన మరింత ఎక్కువయ్యింది. తాగు,సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడబోతున్నాయి. ఈయేడు సాగు సాగడమెలా అన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. జులై మధ్యలోకి వచ్చినగా గట్టి వర్షాలు లేవు. దీంతో వరిసాగు సాగదని రైతులే చెబుతున్నారు. నారు ఎండిపోతోంది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు గోదావరిలో కొత్తో గొప్పో నీళ్లు వస్తున్నాయి తప్ప, కృష్ణా పివాహక పూర్తిగా ఎండిపోయినట్లే. ఇప్పటి వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లతో సతమతమవుతోంది. దేశానికి అన్నం పెట్టే రైతు అనేక సమస్యలమధ్య జీవన పోరాటం సాగిస్తున్నాడు. ప్రకృతి వైపరీత్యాలు, పెరు గుతున్న పెట్టుబడులు, నకిలీ విత్తనాల మోసం, ఎరువుల కొరత, పంటలకు మద్దతు దక్కకపోవడం వంటి సమస్యలు రైతుల ఆర్థిక స్థితిని మరింత దెబ్బతీస్తున్నాయి. రైతుకు ప్రకృతి శాపంగా మారుతోంది. ఒకవైపు కరవు, మరోవైపు ఆకాల వర్షాలు, వరదలు, వడగండ్ల వానల కారణంగా పంటలు నాశనమవుతున్నాయని అనుకుంటే ఇప్పుడు ఎల్‌నినో వాతావరణ మార్పుల ప్రభావంతో పంటల సాగు అనిశ్చితంగా మారింది. రైతు ఎంత కష్టపడి పంట పండించినా ప్రకృతి వైపరీత్యాలు అతని ఆశలను ఆవిరి చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభ మైన వ్యవసాయరంగం ప్రస్తుతం అనేక సవాళ్లతో కొట్టు మిట్టాడుతోంది. ప్రకృతి వైపరీత్యాల నుండి మొదలై మార్కెట్ మాయాజాలం వరకు ప్రతి ఒక్కటి రైతును అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. రైతు పెట్టుబడి పెట్టే కాలం నుండి పంట చేతికి వచ్చే వరకు అంతా ప్రకృతి చేతుల్లోనే ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల ఒక ఏడాది తీవ్రమైన కరువు ఏర్పడితే, మరో ఏడాది అకాల వర్షాలు, తు ఫానులు, వరదలు పంటలను ముంచెత్తుతున్నాయి. చేతికి వచ్చిన పంట కళ్లముందే నీటిపాలు కావడం తో రైతులకు కోలుకోలేని దెబ్బతగులుతోంది. ఎలాగినో తట్టుకునేలా రైతులకు అత్యవసర సాయానికి ప్రభుత్వాలు రంగంలోకి దిగాలి. ఇకపోతే వ్యవసాయంలో పెట్టు బడులు రోజురోజు పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, లీల ఖర్చులు భారీగా పెరిగాయి. పంటదిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, మార్కెట్లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతు పెట్టిన పెట్టుబడులు డా తిరిగి రావడం లేదు. దీంతో అప్పులు చేయడం తప్ప రైతుకు మరో మార్గం కనిపించడం లేదు. పంటించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదు. ధాన్యం కొంటారన్న గ్యారెంటీ లేదు. దీనికితోడు నకిలీ విత్తనాల సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. అధిక దిగుబడి వస్తుందని నమ్మించి విక్రయించే నకిలీ విత్త నాల వల్ల మొలక శాతం తగ్గిపోవడం, పంటలు దెబ్బతిన దంతో రైతు కుదేలవుతున్నాడు. మరోవైపు ఎరువుల కొరత రైతులకు తలనొప్పిగా మారింది. సీజన్ సమయంలో ఎరు వుల కోసం గంటల తరబడి ్యలలో నిలబడాల్సిన పరి స్థితి ఏర్పడుతోంది. అవసరమైన సమయంలో ఎరువులు అందకపోవడంతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. నేడు వ్యవసాయం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారింది. లీల ఖర్చులు, ట్రాక్టర్ల అద్దెలు, డీజిల్ ధరలు, విత్తనాలు, ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పెట్టుబడి రెట్టింపవుతున్నా దానికి తగ్గట్టు గా పంటకు మద్దతుధర లభించడం లేదు. మార్కెట్ల లో దళారుల వ్యవస్థ, సిండిట్లుగా మారిన వ్యాపారులు రైతు శ్రమను దోచుకుంటున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి రైతుది. పెట్టుబడులు పెరిగి, పంట చేతికిరాక, వచ్చిన పంటకు సరైన ధర దక్కకపోయేసరికి రైతు పూర్తిగా అప్పుల్లో మునిగిపోతాడు. బ్యాంకుల నుండి రుణాలు దొరకని చిన్న, సన్న కారు రైతులు గ్రామీణ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తారు. వారు విధించే చక్రవడ్డీలు చెల్లించలేక, తెచ్చిన అప్పులు తీరే మార్గం కనిపించక సమాజంలో గౌరవం కోల్పోతామనే భయంతో ఎంతో మంది రైతులు పురుగుల మందుతాగి తనువు చాలిస్తున్నారు. ఇంకొందరు ఉరివేసుకుని బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రుణాల విధానం సక్రమంగా లేకపోవడంతో బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకుంటున్నారు. వంట నష్టాలు, ఆదాయం లేక పోవడం వల్ల అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురవు తున్నారు. మనోవేదనతో కొంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతూ వారి కుటుంబాలను రోడ్డు పాల్జేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించా లంటే ప్రభుత్వాలు రైతు సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించాలి. న కిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎరువుల సరఫరాను సకాలంలో అందుబాటులో ఉంచాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన వ్యవ సాయరంగం బలోపేతం కావాలంటే రైతు బాగుండాలి. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి మూలాధారం అనే విషయాన్ని పాలకులు గుర్తించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎల్‌నినో నుంచి గట్టెందుకు తగన వ్యవసాయ ప్రణాళికలు అమలు చేయాలి.

**రుణాల విధానం సక్రమంగా లేకపోవడంతో బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకుంటున్నారు. వంట నష్టాలు, ఆదాయం లేక పోవడం వల్ల అప్పులు తీర్చలేక మానసిక ఒత్తిడికి గురవు తున్నారు. మనోవేదనతో కొంతమంది రైతులు ఆత్మహత్య లకు పాల్పడుతూ వారి కుటుంబాలను రోడ్డు పాల్జేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంనుంచి గట్టెక్కించా లంటే ప్రభుత్వాలు రైతు సమస్యల పై ప్రత్యేక దృష్టి సారించాలి. న కిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎరువుల సరఫరాను సకాలంలో అందుబాటులో ఉంచాలి.**

EDITORIAL

## ఘనంగా సీతారాముల నిత్య కల్యాణం

- **భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఎంపీ పోరిక బలరాం నాయక్**

**ప్రజానావ, భద్రాచలం:** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి అర్చకులు సుప్రభాత సేవతో ప్రారంభించిన నిత్యకైంకర్యాల్లో ఆరాధన, అర్చన, బాలభోగ నివేదన నిర్వహించారు. అనంతరం స్వామివారికి బంగారు కవచాలను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. బేడా మండపంలో వేద మంత్రోచ్చారణల నడుమ పుణ్యాహవాచనం, గోత్రప్రవర పఠనం అనంతరం శ్రీ సీతారాముల నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ గురువారం ఉదయం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి గర్భగుడిలో దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కే. దామోదర్ రావు, ఏఈవోలు శ్రవణ్ కుమార్, భవాని రామకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్ లింగాల సాయిబాబా, వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- **ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**
- **మెగా రైతు మేళాకు విశేష స్పందన**
- **150 స్టాల్స్, 11 వేల మంది రైతుల హాజరు**

**ప్రజానావ, ఖమ్మం :** రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాలో ఆయన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు అండగా నిలుస్తోందన్నారు. దేశంలోనే తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. ధాన్యం, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ రంగంలో ఆధునికీకరణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఆయిల్‌పామ్, ఉద్యాన, మత్స్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు ఆశీర్వాద సభను చింతకానిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ కాలంలో, తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని సూచించారు. మొక్కజొన్న, జొన్న, సోయా వంటి పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించిందని, రైతుల ఖాతాల్లో చెల్లింపులు త్వరలో జమ చేస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం 150 స్టాల్స్ ఏర్పాటు చేశామని, ఐదు వేల మంది రైతులు వస్తారని అంచనా వేయగా దాదాపు 11 వేల మంది రైతులు హాజరయ్యారని తెలిపారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతికత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారని చెప్పారు. వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ జూలై 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు మూడు లక్షల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## చదువుతూనే పరిశ్రమ అనుభవం

- **ఏఈడిపి కోర్సుతో విద్యార్థులకు సువర్ణావకాశం**
- **ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసయ్య**

**ప్రజానావ, పెద్దపల్లి :** ఈ విద్యా సంవత్సరం నుండి పెద్దపల్లి మండలం పెద్దకల్వలలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఈడిపి అప్రెంటి షిప్ ఎంబిడెడ్ డిగ్రీ ప్రోగ్రాంలో భాగంగా బి. కం (బి.ఎఫ్.ఎస్.ఐ) కొత్త కోర్సును ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. లక్ష్మీ నర్సయ్య చెప్పారు. కోర్స్ యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులో అడ్మిషన్ తీసుకోవడం ద్వారా వారి భవిష్యత్తుకు గట్టి పునాదిగా నిలబడుతుందని చెప్పారు. డిగ్రీ విద్యతో పాటు పరిశ్రమల్లో అప్రెంటిషిప్ ద్వారా ప్రాయోగిక శిక్షణ పొందే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని వివరించారు. డిగ్రీ పూర్తయ్యేసరికి

పని అనుభవం, వృత్తి నైపుణ్యాలు, పరిశ్రమలతో అనుసంధానం ఏర్పడడం వల్ల ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, కమ్యూనికేషన్ స్కిల్స్, వృత్తిపరమైన అనుభవం కూడా అవసరమని ఈ అంశాలను ఏఈడిపి కోర్సు బి. కం (బి.ఎఫ్.ఎస్.ఐ) సమర్థవంతంగా అందిస్తుందని ప్రిన్సిపల్ లక్ష్మీ నరసయ్య చెప్పారు. భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు, మెరుగైన వేతన అవకాశాలు, కెరీర్ అభివృద్ధికి ఇంతగానో దోహద పడుతుందని అన్నారు. మొదటి, రెండవ సంవత్సరం చదివిన తర్వాత మూడో సంవత్సరం నుండి పరిశ్రమలతో అనుసంధానించబడి అప్రెంటిషిప్ పూర్తి చేసుకుంటారని తర్వాత వెంటనే అదే పరిశ్రమలో గాని లేదా వేరే పరిశ్రమలలో గాని నేర్చుకున్న చదువు అప్రెంటిషిప్ నైపుణ్యంతో ఉద్యోగంలో చేరిపోవచ్చని, విద్యార్థులు చిన్న వయసులోనే సంపాదిస్తూ జీవితంలో తొందరగా స్థిరపడిపోవడానికి ఈ కోర్సు చక్కగా ఉపయోగపడుతుందని బలమైన విశ్వాసంతో చెప్పారు. విద్యార్థులు ఒకవేల పై చదువులు చదవాలని కోరుకుంటే పీజీ ప్రవేశ పరీక్షల ద్వారా ఉన్నత విద్యను కూడా స్వీకరించవచ్చని వివరించారు.

## నవోదయ 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2027–28 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ జూలై 31, 2026 అని తెలిపారు. ప్రవేశ పరీక్ష నవంబర్ 28, 2026న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

## ఏఎస్ఐగా యాదగిరికి పదోన్నతి

- **పదోన్నతి సూచిక అందజేసి అభినందించిన జిల్లా ఎస్పీ డీ. జానకి**

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** స్పెషల్ బ్రాంచ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి. యాదగిరి అసి స్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన మహబూ బ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకిని కలిశారు. ఎస్పీ డి. జానకి యాదగిరికి పదోన్నతి సూచికను అందజేసి అభినంద నలు తెలిపారు. విధుల్లో ఇదే నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. 1990 బ్యాచ్‌కు చెందిన యాదగిరి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో సుదీర్ఘకాలం సేవలందించారు. పదోన్నతిపై ఆయనను జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు.

## పాత పనులకే కొత్త శంకుస్థాపనలు: బీఆర్ఎస్

- **మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి**

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంజూరు చేసిన నిధులు, అభివృద్ధి పనులకే కాంగ్రెస్ మంత్రులు మళ్లీ శంకుస్థాపనలు చేయడం మంది పైసలకు మంగళహారతులు పట్టినట్లుగా ఉందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ విమర్శించారు. వనపర్తిలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నివాసంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల ఖిల్లా ఘనపూర్ మండలం వెంకటాంపల్లికి చెందిన లబ్ధిదారుడు సిద్ధి రాము అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రకటించిన రూ.5 లక్షల్లో కేంద్రం, పంచాయతీ నిధులు మినహాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.2.30 లక్షలు మాత్రమేనని, ఆ మొత్తంతో ఇల్లు నిర్మించడం సాధ్యం కాదన్నారు. మృతుడి కుటుంబా నికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ఇందిరమ్మ ఇళ్ల ఆర్థిక సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్ధి రాము మృతిపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఐటీ టవర్, పాలిటెక్నిక్ కళాశాల ఆధునీకరణ వంటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులకే మళ్లీ శంకుస్థాపనలు చేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. మిగిలిన రోడ్ల విస్తరణ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం, సచివాలయం, కలెక్టరేట్లు, మెడికల్ కళాశాలలు, గురుకులాల నిర్మాణంతో పాటు రైతుబంధు, ఆసరా వంటి సంక్షేమ పథకాలు అమలు చేశామని పేర్కొన్నారు. రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని, అవసరమైతే బహిరంగ చర్చకు సిద్ధమని అన్నారు. ఈ సమావేశంలో గంధం పరంజ్యోతి, హేమంత్ ముదిరాజ్, జోహెబ్ హుస్సేన్, సునీల్ వాల్మీకి, సయ్యద్ జమీల్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ ఎన్‌రోల్‌మెంట్ పెంచాలి

- **మధ్యాహ్న భోజన పథకం అమలుపై కలెక్టర్ చంద్రశేఖర్ సమీక్ష**

**ప్రజానావ, నల్లగొండ:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) ఎన్‌రోల్‌మెంట్‌ను 13 వేల వరకు పెంచాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎంఈఓలతో నిర్వహించిన పీఎం పోషణ్ పథకం, మధ్యాహ్న భోజనం, కిచెన్ గార్డెన్లు, ఎల్పీజీ కనెక్షన్లు, ఫుడ్ సేఫ్టీ, తిథి భోజనం తదితర అంశాల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 200 మంది విద్యార్థులు ఉన్న జడ్పీ, ఎంపీపీ పాఠశాలలకు రెండు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు మంజూరు చేస్తామని తెలిపారు. అయితే సిలిండర్లు వినియోగించకుండా నిర్లక్ష్యం చేస్తే సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి ఖర్చు రికవరీ చేస్తామని హెచ్చరించారు. ఎఫ్ఆర్ఎస్ ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచిన పాఠశాలలకు సిలిండర్ల కేటాయింపులో ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల ఆధార్ నమోదు పూర్తి చేయాలని, ఆధార్ కిట్ల ద్వారా కొత్త నమోదు, సవరణలు చేపట్టాలని సూచించారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ఆధార్ నమోదు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయల సాగును ప్రోత్సహించాలని, విద్యార్థులను కూడా నిర్వహణలో భాగస్వాములను చేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్‌కరణ్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశేందర్ రావు, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీఎం రాంపంతి నాయక్, అడిషనల్ డీఆర్డీఓ శ్రవణ్ కుమార్, జిల్లా అధికారులు, ఎంఈఓలు పాల్గొన్నారు.

## వనపర్తి పోలీసులకు 11 పతకాలు

- **జోనల్ డ్యూటీ మీట్‌లో ప్రతిభ**
- **రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత**

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** మహబూబ్‌నగర్‌లో ఇటీవల నిర్వహించిన జోగులాంబ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్–2026 పోటీల్లో వనపర్తి జిల్లా పోలీసులు విశేష ప్రతిభ కనబరిచారు. శాస్త్రీయ దర్యాప్తు, సైబర్ క్రైమ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ తదితర విభాగాల్లో మొత్తం 11 పతకాలు (5 బంగారు, 5 రజత, 1 కాంస్య) సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత పొందారు. ఈ సందర్భంగా విజేతలను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సునితారెడ్డి ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, దర్యాప్తు సామర్థ్యాలను పెంపొందించేందుకు డ్యూటీ మీట్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో ప్రతిభ కనబర్చి జిల్లా ప్రతిష్ఠను మరింత పెంచాలని విజేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, ఆర్ఐలు అప్పలనాయుడు, శ్రీనివాస్, ఎస్సై అంజద్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**ప్రజానావ, మిర్యాలగూడ:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను కచ్చితత్వంతో త్వరగా పూర్తి చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం, తుంగపాడు, దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామాల్లో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, స్థానికులు పాల్గొన్నారు.

## భూ రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలి

**సీసీఎల్ఏ డీ.ఎస్. లోకేష్ కుమార్**

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** భూముల రీసర్వే ప్రక్రియను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ శాఖ భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో భూ రీసర్వే, 'భూ భారతి' పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వనపర్తి కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రీసర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయడంతో పాటు 'భూ భారతి'లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

## ఏఐటీయూసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

- శ్రీరాంపూర్ ఆర్కే–7 గనిపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ
- నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్

**ప్రజానావ, మంచిర్యాల:** ఆగస్టు 2న నిర్వహించనున్న ఏఐటీయూసీ మంచిర్యాల్ జిల్లా మహాసభలను కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.కే. బాజీ సైదా, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి కొమురయ్య పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–7 గనిపై జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. కార్మిక హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాల అమలు, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోందన్నారు. జిల్లా మహాసభల్లో కార్మిక సమస్యతో పాటు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లపై సమగ్ర చర్చ జరగనున్నట్లు తెలిపారు. ఈ కోడ్‌లు కార్మిక హక్కులను బలహీనపరిచేవేనని పేర్కొంటూ, వాటిని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహాసభలకు ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్, ఎస్‌సీడబ్ల్యూయూ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుచ్చయ్య, బాలకృష్ణ, మారపల్లి సారయ్య, సదానందం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ కేటాయింపు చారిత్రాత్మక నిర్ణయం

- సంస్థ అభివృద్ధి, కార్మికుల ఉద్యోగ భద్రతకు ఎంతో కీలకం
- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డా. జనక్ ప్రసాద్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు
- మరిన్ని బొగ్గు బ్లాకులు కేటాయించాలని వినతి

**ప్రజానావ, రామగుండం:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను కేటాయించడం సంస్థ భవిష్యత్ అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి పెంపు, కార్మికుల ఉద్యోగ భద్రతకు చారిత్రాత్మక నిర్ణయమని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డా. జనక్ ప్రసాద్ అన్నారు. ఈ బ్లాక్ కేటాయింపునకు సహకరించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి దీర్ఘకాలిక అభివృద్ధి, కార్మికుల ఉద్యోగ భద్రత, తెలంగాణ పారిశ్రామిక ప్రగతిని దృష్టిలో ఉంచుకుని ఐఎన్టీయూసీ, రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను కేంద్రం పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. తాడిచర్ల–2 బ్లాక్‌లో సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉండగా, ఏడాదికి 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతుందన్నారు. దీంతో మరో 40–50 సంవత్సరాల పాటు సింగరేణికి బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండి, సంస్థ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.64వేల కోట్ల రెవెన్యూ, వేలం లేకుండా కేటాయించడంతో రూ.2,550 కోట్ల ప్రీమియం భారం ఆదా, తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీలు, పన్నుల రూపంలో ఏడాదికి రూ.16,000 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే ప్రత్యక్షంగా 1,200 మందికి, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

### గోదావరి వ్యాలీలోని బ్లాకులను కూడా కేటాయించాలి

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోయగూడెం బ్లాక్–3, సత్తుపల్లి బ్లాక్–3తో పాటు గోదావరి వ్యాలీలోని ఇతర బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికి కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఐఎన్టీయూసీ తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ నిర్ణయానికి సహకరించిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.డి. చంద్రశేఖర్, సీనియర్ వైస్‌ప్రెసిడెంట్లు ధర్మపురి, త్యాగరాజన్, కాంపెల్లి సమయ్య, జెట్టి శంకర్‌రావు పాల్గొన్నారు.

## గనుల్లో డీఎంఎస్ అధికారుల తనిఖీ

- ఎస్ఆర్‌పీ ఓసీపీలో రికార్డులు, రక్షణ ఏర్పాట్ల పరిశీలన
- భద్రతా చర్యలపై అధికారులకు కీలక సూచనలు

**ప్రజానావ, మంచిర్యాల:** శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనుల్లో భద్రతా ప్రమాణాలను డీఎంఎస్ (మైనింగ్) అధికారులు గురువారం పరిశీలించారు. 24వ వార్షిక త్రైపాక్షిక భద్రతా సమావేశాల్లో పాల్గొనేందుకు శ్రీరాంపూర్‌కు వచ్చిన డీఎంఎస్ (మైనింగ్) అధికారి సాగేష్ కుమార్, జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి ఎస్ఆర్‌పీ ఓసీపీని సందర్శించారు. ప్రాజెక్టు కార్యాలయంలో ఉపరితల గని పనుల తీరు, వర్కింగ్ ప్లేసెస్, అనుమతులు, రక్షణ ఏర్పాట్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఓసీపీలోని బొగ్గు ఉత్పత్తి ప్రాంతాలను తనిఖీ చేసి, భద్రతా ప్రమాణాల అమలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంఎస్ (మైనింగ్) అధికారి సాగేష్‌కుమార్‌ను జీఎం మునిగంటి శ్రీనివాస్ పూలమొక్క, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ ఓసీపీ ప్రాజెక్టు అధికారి సీహెచ్. వెంకటేశ్వర్లు, మేనేజర్ మధుసూదన్, ప్రాజెక్టు ఇంజనీర్ నాగరాజు, సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్‌రావు, డీవైఎస్ఎస్ఓ సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతోనే బాధితులకు సత్వర న్యాయం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే. ప్రభాకర్‌రావు

**ప్రజానావ, ఆదిలాబాద్:** బాధితులకు సత్వర న్యాయం అందించాలంటే న్యాయవ్యవస్థ, పోలీసు శాఖ, వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయడం అత్యంత అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. ప్రభాకర్ రావు అన్నారు. సమిష్టి కృషితోనే నేరాలను శాస్త్రీయంగా నిరూపించి నిందితులకు శిక్షలు పడేలా చేయవచ్చని పేర్కొన్నారు. బుధవారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్ సమావేశ మందిరంలో న్యాయమూ ర్తులు, పోలీసు అధికారులు, ప్రభుత్వ వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయ మూర్తి మాట్లాడుతూ హత్యలు, అత్యాచారాలు, రోడ్డు ప్రమాదాలు, గాయాల కేసుల దర్యాప్తులో ప్రతి అంశాన్ని చట్టబద్ధంగా, శాస్త్రీయంగా నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా వైద్యులు అందించే మెడికల్ రిపోర్టులు, మెడికో–లీగల్ పరీక్షలు, నమూనాల సేకరణ, వైద్య నివేదికలు కేసుల విచారణలో కీలకమని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాలను సమర్థవంతంగా వినియోగించాలని దర్యాప్తు అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ నాణ్యమైన దర్యాప్తు, శాస్త్రీయ సాక్ష్యాల సేకరణ, సంబంధిత శాఖల సమన్వయంతో నిందితులకు శిక్షలు పడేలా ఆదిలాబాద్ జిల్లా పోలీసులు కట్టుదిట్టంగా పనిచేస్తున్నారని తెలిపారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని చెప్పారు. సమావేశంలో జిల్లాలోని న్యాయమూర్తులు, అదనపు ఎస్పీ పి. మౌనిక, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జయసింగ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డీఎస్పీలు, వైద్యులు, పోలీసు అధికారులు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## విపత్తుల సమయంలో ఎస్డీఆర్ఎఫ్ కీలకం

- ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో ఎస్డీఆర్ఎఫ్ యంత్రాలు, పరికరాల ప్రదర్శన
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే

**ప్రజానావ, సిరిసిల్ల :** విపత్తుల సమయంలో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) ఆధ్వర్యంలో విపత్తులు, వరదలు వచ్చే సమయంలో ఉపయోగించే యంత్రాలు, పరికరాల ప్రదర్శన గురువారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులను గుర్తించే కెమెరా, రిమోట్ కంట్రోల్ లైఫ్ బోయ్ (ప్రాణరక్షక తేలియాడే పరికరం), తనిఖీ రంధ్రం చేసే పరికరం, ఎత్తైన వెలుతురు స్తంభం (లైట్ మాస్ట్), రక్షణ కార్యక్రమాల కోసం ఉపయోగించే రోటరీ కట్టింగ్ యంత్రం, గాలి ద్వారా బరువులను ఎత్తే లిఫ్టింగ్ బ్యాగ్, పీపీసీ రక్షణ దుస్తులు, హైడ్రాలిక్ స్పెడర్ కట్టర్ (లోహాన్ని విప్పే, కత్తిరించే పరికరం) ప్రదర్శన లో పెట్టగా, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులతో కలిసి పరిశీలించారు. ఒక్కో యంత్రం పనితీరు, వాటిని ఉపయోగించే విధానాన్ని వివరించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు కామారెడ్డి, వరంగల్ ఇతర ప్రాంతాల్లో ఎస్ డీ ఆర్ ఎఫ్ టీమ్ అందించిన సేవల వీడియోలను ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు రిజర్వాయర్లు ఎగువ మానేరు, మధ్య మానేరు, అన్నపూర్ణ, మల్కపేట ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంతో పాటు సెప్టెంబర్, అక్టోబర్ నెలలో భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ డీ ఆర్ ఎఫ్ బృందం శిక్షణ లో నేర్చుకున్న అంశాలు విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే వినియోగించాల్సి వస్తుందని తెలిపారు. అప్పుడు ప్రతి నిమిషం విలువైందని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులు ఒక టీమ్‌గా సమాచారం చేరవేస్తూ.. వరదలు వచ్చినప్పుడు సమన్వయంతో సేవలు అందించాలని ఆదేశించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు వివిధ జిల్లాల్లో ఉత్తమ సేవలు అందించిన ఎస్డీఆర్ఎఫ్ బృందం, ఇతర అధికారులను అభినందించారు. ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ.. వర్షాలు వస్తే సేవలు అందించేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలని సూచించారు. గత ఏడాది వరదలు సంభవించి ఇబ్బంది పడిన చోట్ల అధికారులు పరిశీలించి.. ఇంకా కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. విపత్తులు సంభవించినప్పుడు వాడే పరికరాలు, యంత్రాలతో మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఇంకా ఏమైనా యంత్రాలు, పరికరాలు కావాల్సి ఉంటే ముందస్తుగా తెప్పించాలని సూచించారు. ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కమాండెంట్ పీ జె.పి.సి. ఛటర్జీ, అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్, అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు,ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ బండి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోలీస్ కళాబృందం అవగాహన

- ప్రేమ మోసాలు, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్‌పై హెచ్చరికలు

**ప్రజానావ, కామారెడ్డి:** మాచారెడ్డి మండలంలోని పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు సామాజిక అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, మాచారెడ్డి ఎస్సై అనిల్ కుమార్ సూచనలతో ఏఎస్ఐ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రేమ పేరుతో జరిగే మోసాలు, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, మహిళలు, చిన్నారులపై నేరాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. ఉన్నత లక్ష్యాలతో చదువుకుంటూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్–100, సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930, మహిళల భద్రత కోసం కామారెడ్డి షీ టీమ్ నంబర్ 8712686094ను వినియోగించాలని వివరించారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, బృంద సభ్యులు పాటలు, సందేశాత్మక ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## డీసీహెచ్ఎస్‌ని సందర్శించిన డీఎంహెచ్ఓ డాక్టర్ వై. పవిత్ర

**ప్రజానావ, పెద్దపల్లి :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర పెద్దపల్లిలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ (డి.సి.హెచ్.ఎస్) ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో దంత వైద్య పరీక్ష (డెంటల్ చెకప్) చేయించుకున్నారు. అనంతరం ఆసుపత్రి వైద్య సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ని కలిసి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు, ఆరోగ్య సేవల నాణ్యతపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## అనుపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం: ఒకరు మృతి

- బొలెరోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- పలువురు కూలీలకు తీవ్ర గాయాలు

**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామం సమీపంలోని ప్రధాన రహ దారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన రైతు కూలీ లు ప్రయాణిస్తున్న బొలెరో ట్రాలీ వాహనాన్ని సిరిసిల్ల నుంచి కరీం నగర్ వెళ్తున్న నాన్‌స్టాప్ ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని వేములవాడ, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, తంగళ్లపల్లి మండలం లక్ష్మిపూర్ గ్రామంలో వ్యవసాయ పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది. బొలెరో వాహనంలో సుమారు 20 మందికి పైగా కూలీలు ప్రయాణిస్తుండగా, పలువురికి తీవ్ర గాయాలు కాగా మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. పరిస్థితి విషమం గా ఉన్న ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతె పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి

- ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయం శుభ్రంగా ఉండాలి
- ప్రత్యేక అధికారులు, టాస్క్ కోర్స్ టీం షెడ్యూల్ ప్రకారం తనిఖీ చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- మండల ప్రత్యేక అధికారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్ డీసీఓలు, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాళ్ళతో జిల్లా కలెక్టర్ సమీక్ష

**ప్రజానావ, సిరిసిల్ల :** అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో మెనూ ప్రకారం భోజనం పరిశుభ్రత, నిరంతర తనిఖీలు తదితర అంశాలపై జిల్లా విద్యాధికారి, మండల ప్రత్యేక అధికారులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ట్రైబల్ వెల్ఫేర్ డీసీఓలు, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాళ్ళు, వివిధ శాఖల అధికారులతో పంచాయతీరాజ్ టి జి ఈడబ్ల్యుఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయం లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ గురువారం సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాలకు ప్రత్యేక అధికారులను జిల్లా కలెక్టర్ నియమించారు. ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రత్యేక అధికారులు, అలాగే టాస్క్ ఫోర్స్ టీంలు తనిఖీ చేసిన సందర్భంగా గుర్తించిన ఇబ్బందులు, ఇంకా కావాల్సిన ఏర్పాట్లపై సిద్ధం చేసిన నివేదికపై సమీక్ష చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తప్పనిసరిగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని, దీనిని అన్ని గురుకు లాల డీసీఓ లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయం ఆవరణ, లోపల కిచెన్, డైనింగ్ హాల్ నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు, టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు తమకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం తనిఖీ చేయాలని దానికి సంబంధించిన నివేదికలను ఎప్పటి కప్పుడు అందజేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లా అధికారికి ఒక విద్యాలయం కేటాయించామని, వారు విద్యా ర్థులతో కలిసి భోజనం చేయాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్లు, ఫుడ్ ఇన్స్పెక్టర్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు అన్ని రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ట్రైబల్ డీసీఓలు, ఆయా మండలాల ప్రత్యేక అధికారులు పంచాయతీ రాజ్ శాఖ ఈఈ సుదర్శన్ రెడ్డి, టీజీఈడబ్ల్యుఐడీసీ అశోక్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవం

- విద్యార్థులతో మహా ర్యాలీ
- విద్యార్థి సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటమే లక్ష్యమన్న నాయకులు

**ప్రజానావ, వరంగల్ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో సంస్థ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విద్యార్థులతో మహా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏబీవీపీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సందీప్ పాల్గొని మాట్లాడారు. 1949 జూలై 9న ప్రారంభమైన ఏబీవీపీ చిన్న సంస్థగా మొదలై, ప్రస్తుతం సుమారు 77 లక్షల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందని తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ ఎప్పటికప్పుడు ముందుండి పోరాటం చేస్తోందని చెప్పారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాల్లో ఏబీవీపీ కీలక పాత్ర పోషించిందని, అక్రమ చొరబాట్ల నిరోధం, ఆర్టికల్ 370 రద్దు వంటి అంశాల్లో సంస్థ తన వంతు పాత్రను పోషించిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నిర్వహించిన రణభేరి, నా రక్తం–నా తెలంగాణ వంటి భారీ కార్యక్రమాలతో ఉద్యమానికి మద్దతు తెలిపిందన్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కన్వీనర్ బెల్లం కార్తీక్, వరంగల్ మహానగర మంత్రి హరీష్ రావు, కార్యకర్తలు అభిలాష్, సిద్ధు, నవీన్, బన్నీ, అరవింద్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లలో చోరీల ముఠా అరెస్ట్

- పోలీసులు అదుపులో నలుగురు నిందితులు
- చోరీ సొత్తు స్వాధీనం

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, సిరిసిల్లకు చెందిన ఆడెపు రవి అలియాస్ చోరు రవి, గాజులవేణి అరుణ్ కుమార్, ఈగ కృష్ణ, కొనరావుపేటకు చెందిన గాజుల హేమంత్ కలిసి పలు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో తగిన భద్రతా చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఎక్కువ రోజుల పాటు ఇంటికి దూరంగా ఉండాల్సి వస్తే సమీప బంధువులు లేదా నమ్మకమైన పొరుగువారికి సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్–100కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో నేరాలను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చని డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు.

Singareni news

## రష్యా చమురు కేంద్రాలపై
# ఉక్రెయిన్ దాడులు

- ఇంధన సరఫరాపై ఉక్రెయిన్ వ్యూహాత్మక దెబ్బ
- చమురు డిపోలు, రెండు ట్యాంకర్లకు అంటుకున్న నిప్పు
- శాంతి చర్చలకు యుద్ధం ముగించాలంటే రష్యానే ముందుకు రావాలి: జెలెన్‌స్కీ

కీవ్: రష్యాపై ఉక్రెయిన్ మరోసారి భారీ డ్రోన్ దాడులు నిర్వహించింది. పశ్చిమ రష్యాలోని చమురు నిల్వ కేంద్రాలతో పాటు అజోవ్ సముద్రంలో ఉన్న రెండు చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుని దాడులు జరపడంతో భారీ అగ్నిప్రమాదాలు సంభవించాయి. ఈ దాడులతో రష్యా ఇంధన సరఫరా వ్యవస్థకు మరోసారి గట్టి దెబ్బ తగిలింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ మాట్లాడుతూ, యుద్ధాన్ని ముగించేందుకు రష్యా నిరాకరిస్తున్నందున తమ దూరప్రహార వ్యూహం కొనసాగుతోందని తెలిపారు. యుద్ధాన్ని నిలిపివేయాలని ఉక్రెయిన్ ఎప్పటి నుంచో కోరుతోందని, ఆలస్యం జరిగే ప్రతి రోజూ యుద్ధ ప్రభావాన్ని రష్యానే అనుభవించాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.

### చమురు కేంద్రాలే లక్ష్యం

ట్వేర్, స్టావ్రోపోల్ ప్రాంతాల్లోని చమురు డిపోల్లో డ్రోన్ దాడులతో మంటలు చెలరేగాయి. రోస్తోవ్ ప్రాంతంలోని చమురు లోడింగ్ టెర్మినల్‌తో పాటు అజోవ్ సముద్రంలోని రెండు ఆయిల్ ట్యాంకర్లు కూడా మంటల్లో చిక్కుకున్నాయి. ఒక ట్యాంకర్‌లో మంటలు కొనసాగుతుండగా సిబ్బందిని సురక్షితంగా తరలించినట్లు రష్యా అధికారులు తెలిపారు.

### పేట్రియట్ తయారీకి అమెరికా అనుమతి

ఉక్రెయిన్‌లోనే పేట్రియట్ వైమానిక రక్షణ వ్యవస్థలను తయారు చేసుకునేందుకు అమెరికా లైసెన్స్ ఇవ్వనున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే ఈ వ్యవస్థల తయారీ ప్రారంభానికి కనీసం ఏడాది లేదా అంతకంటే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని ఉక్రెయిన్ రక్షణ శాఖ సలహాదారులు తెలిపారు. సాంకేతిక పత్రాలు, విడిభాగాల సరఫరా, నిపుణుల శిక్షణ వంటి ప్రక్రియలు పూర్తికావాల్సి ఉందని పేర్కొన్నారు. మరోవైపు అమెరికా నిర్ణయంపై స్పందించిన క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్.. అమెరికా వైఖరి ద్వంద్వంగా ఉన్నప్పటికీ శాంతి ప్రయత్నాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే ఉక్రెయిన్ దాడులు పెరిగిన కొద్దీ తమ భద్రతా బఫర్ జోన్‌ను మరింత విస్తరిస్తామని హెచ్చరించారు. సైనిక ఒత్తిడితో శాంతి సాధ్యం కాదని, యుద్ధం మరింత సుదీర్ఘమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మరోసారి చర్చలకు సిద్ధంగా ఉన్నారని కూడా వెల్లడించారు.

క్రిమియా ద్వీపకల్పానికి వెళ్లే ఇంధన సరఫరాను దెబ్బతీయడమే ఈ దాడుల ప్రధాన ఉద్దేశమని విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యా రక్షణ శాఖ ప్రకారం, బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 73 ఉక్రెయిన్ డ్రోన్లను తమ వైమానిక రక్షణ వ్యవస్థ కూల్చివేసింది. మరోవైపు రష్యా 94 డ్రోన్లు, రెండు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేయగా, వాటిలో ఎక్కువ భాగాన్ని అడ్డుకున్నామని ఉక్రెయిన్ వైమానిక దళం వెల్లడించింది.

# వరుణుడి ఉగ్రరూపం

- పలు రాష్ట్రాల్లో కుండపోత.. 10 మందికిపైగా మృతి
- వరదలు, కొండచరియల విరిగిపడటంతో జనజీవనం అస్తవ్యస్తం
- పలు ప్రాంతాలకు రెడ్ అలర్ట్.. మరిన్ని వర్షాల హెచ్చరిక
- దేశమంతా విస్తరించిన నైరుతి రుతుపవనాలు

**న్యూఢిల్లీ:** నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా ఉధృతంగా కొనసాగుతున్నాయి. గురువారం కురిసిన భారీ వర్షాలు పలు రాష్ట్రాల్లో బీభత్సం సృష్టించాయి. వరదలు, కొండచరియలు విరిగిపడటం, పిడుగులు పడటం, భవనాలు, గోడలు కూలిపోవడం వంటి ఘటనల్లో దేశవ్యాప్తంగా 10 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. రహదారులు జలమయమవడంతో రాకపోకలు స్తంభించగా, వందలాది ప్రాంతాల్లో సాధారణ జీవనం తీవ్రంగా దెబ్బతింది. మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరిస్తూ పలు ప్రాంతాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లు జారీ చేసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో దేశ రాజధాని ఢిల్లీ నీట మునిగింది. రోహిణిలో భవనం కూలిన ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరగా, అనేక ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. వాహనాలు నీటిలో చిక్కుకుపోవడంతో భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. చెట్లు విరిగి పడటంతో పలు చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి.

### హిమాచల్, అరుణాచల్‌లో వరదల ఉధృతి

అరుణాచల్‌ప్రదేశ్‌లో ఆరు జిల్లాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడి ఇళ్లు, రహదారులు, పంటలు దెబ్బతిన్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని కిన్నౌర్‌లో నది ఉధృతికి 100 అడుగుల ఇనుప వంతెన పూర్తిగా నీట మునిగిపోగా, లిప్పా గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. కొండచరియలు విరిగిపడటంతో పలు రహదారులు మూతపడ్డాయి. ఉత్తరాఖండ్‌లో 107 రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. కేరళలోని పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరగా, మరో ఇద్దరి కోసం గాలింపు కొనసాగుతోంది. ఇదిలాఉంటే నైరుతి రుతుపవనాలు రాజస్థాన్, హర్యానా, పంజాబ్‌లోని మిగిలిన ప్రాంతాలకు కూడా విస్తరించడంతో దేశమంతటా వర్షాకాలం పూర్తిస్థాయిలో నెలకొంది. జూలై తొలి తొమ్మిది రోజుల్లో దేశంలో సాధారణం కంటే గణనీయంగా అధిక వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ వెల్లడించింది. మరికొన్ని రోజులు పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరించింది.

### సూరత్‌లో 17కు చేరిన మృతుల సంఖ్య

గుజరాత్‌లోని సూరత్‌లో వరద పరిస్థితులు క్రమంగా అదుపులోకి వస్తున్నప్పటికీ, మరో ఆరు మృతదేహాలు లభ్యమవడంతో వర్ష సంబంధిత ఘటనల్లో మృతుల సంఖ్య 17కు చేరింది. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఉత్తరప్రదేశ్‌లో పిడుగులు, గోడలు కూలడం, వర్షపు నీటిలో కొట్టుకుపోవడం వంటి ఘటనల్లో ఏడుగురు మృతిచెందారు. పశ్చిమ యూపీలో అత్యంత భారీ వర్షాల హెచ్చరికతో ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. జూలై 11 వరకు విస్తృతంగా వర్షాలు కొనసాగనున్నట్లు తెలిపింది.

## వైట్‌హౌస్‌పై దాడి కుట్ర భగ్నం

- డ్రోన్, స్నైపర్ దాడి యత్నం కేసులో ఎనిమిది మందిపై అభియోగాలు
- ఆయుధాలు, పేలుడు పదార్థాలు, డ్రోన్లు సమీకరించినట్లు వెల్లడి

కొలంబస్: అమెరికాలోని వైట్‌హౌస్‌లో జూన్‌లో నిర్వహించిన యూఎఫ్‌సీ (కేజ్ ఫైటింగ్) కార్యక్రమంపై డ్రోన్, స్నైపర్ దాడికి కుట్ర పన్నిన కేసులో ఎనిమిది మందిపై ఫెడరల్ అధికారులు అభియోగాలు నమోదు చేశారు. హత్యకు కుట్ర, ఉగ్రవాద సంస్థలకు సహకారం అందించే కుట్రతో పాటు ఫెడరల్ ప్రభుత్వ అధికారిని హత్య చేయాలనే యత్నానికి సంబంధించిన కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఓహియోలోని ఫెడరల్ గ్రాండ్ జ్యూరీ గురువారం ఈ మేరకు అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. దర్యాప్తు వివరాల ప్రకారం, నిందితులు మే నెల నుంచే దాడికి ప్రణాళిక రూపొందించి, భారీ మొత్తంలో నిధులు సమీకరించడంతో పాటు తుపాకులు, మందుగుండు సామగ్రి, బాడీ ఆర్మర్, పేలుడు పదార్థాలు, డ్రోన్లు, వైద్య పరికరాలు, కమ్యూనికేషన్ సామగ్రిని కూడబెట్టినట్లు గుర్తించారు. దర్యాప్తు సంస్థల అప్రమత్తతతో ఈ కుట్రను ముందుగానే భగ్నం చేసినట్లు అధికారులు తెలిపారు. కేసుపై మరింత లోతైన విచారణ కొనసాగుతోందని వెల్లడించారు.

# రవాణా రంగ భవిష్యత్ హైడ్రోజనే

- దేశవ్యాప్తంగా 10 మార్గాల్లో ప్రయోగాలు
- ప్రత్యామ్నాయ ఇంధనాల్లో ప్రపంచానికి భారత్ మార్గదర్శి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

**గాంధీనగర్:** హైడ్రోజన్ ఇంధనమే రవాణా రంగ భవిష్యత్తని, దేశవ్యాప్తంగా 10 కీలక మార్గాల్లో హైడ్రోజన్ ఇంధన వినియోగంపై ప్రయోగాలు జరుగుతున్నాయని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. గుజరాత్‌లో నిర్వహించిన ప్రవాస్ 5.0, భారత్ ప్రవాస్ అవార్డ్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రేటర్ నోయిడా–ఢిల్లీ–ఆగ్రా, భువనేశ్వర్–కోణార్క్–పురీ, అహ్మదాబాద్–వడోదర–సూరత్, సాహిబాబాద్–ఘరీదాబాద్–ఢిల్లీ, పుణె–ముంబై, జంషెడ్‌పూర్–కళింగనగర్, తిరువనంతపురం–కొచ్చి, కొచ్చి–ఎడప్పల్లి, జామ్‌నగర్–అహ్మదాబాద్, విశాఖపట్నం–బయ్యవరం (ఎన్‌హెచ్–16) మార్గాల్లో ఈ ప్రయోగాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రత్యామ్నాయ ఇంధనాలు, బయోఫ్యూయెల్ రంగంలో భారత పరిశ్రమలు వేగంగా పురోగమిస్తున్నాయని, సాంకేతికతతో పాటు తక్కువ వ్యయంతో ఈ రంగంలో భారత్ ప్రపంచానికి నాయకత్వం వహించే సామర్థ్యం కలిగి ఉందన్నారు. ప్రపంచ స్థాయి సాంకేతికతతో, ప్రయాణికులకు మరింత



సౌకర్యవంతమైన బస్సులను తయారు చేయాలని తయారీ సంస్థలు, రవాణా సంస్థలకు సూచించారు.

### రోడ్డు భద్రతే అత్యంత ప్రాధాన్యం

దేశంలో ప్రతి ఏడాది సుమారు 5 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా, 1.80 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని గడ్కరీ తెలిపారు. మరణించిన వారిలో 66 శాతం మంది 18–36 ఏళ్ల మధ్య వయస్సు వారేనని, ప్రమాదాల వల్ల దేశ జీడీపీలో 3 శాతం నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణలో పరిశ్రమలు సహకరించాలని, రోడ్డు భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తాను బాధ్యతలు స్వీకరించినప్పుడు రూ.14 లక్షల కోట్ల పరిమాణంతో ప్రపంచంలో ఏడో స్థానంలో ఉన్న భారత ఆటోమొబైల్ పరిశ్రమ ప్రస్తుతం రూ.22 లక్షల కోట్లకు చేరి మూడో స్థానంలో నిలిచిందన్నారు. త్వరలోనే ప్రపంచంలో తొలి స్థానానికి చేరుకోవడమే లక్ష్యమని చెప్పారు. ఈ రంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యధిక ఆదాయం సమకూర్చడమే కాకుండా 4.5 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు.

### బస్సుల ఉత్పత్తి పెంచాలి

దేశానికి ఏటా సుమారు 3 లక్షల బస్సులు అవసరమవుతుండగా ప్రస్తుతం కేవలం 70–80 వేల బస్సులే తయారవుతున్నాయని తెలిపారు. ఉత్పత్తిని కనీసం మూడు రెట్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. లిథియం–అయాన్ బ్యాటరీల ధరలు తగ్గిన నేపథ్యంలో ఆ ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించాలని ఎలక్ట్రిక్ బస్సుల తయారీదారులకు సూచించారు. బస్సులు, ట్రక్కులు, కార్ల ఛార్జింగ్ ఖర్చు తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. బస్సుల భద్రత కోసం గత ఏడాది సవరించిన బస్ బాడీ కోడ్‌ను అమలు చేస్తున్నామని, బస్ బాడీ తయారీ సంస్థలకు పరీక్షల రుసుమును 50 శాతం తగ్గించడంతో పాటు అనుమతుల ప్రక్రియను 16 వారాల నుంచి 6 వారాలకు కుదించినట్లు గడ్కరీ వెల్లడించారు. దేశవ్యాప్తంగా ప్రైవేట్ బస్‌పోర్టుల నిర్మాణానికి కూడా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవేలు ప్రయాణ సమయాన్ని తగ్గించి రవాణా రంగ లాభదాయకతను పెంచుతాయని ఆయన పేర్కొన్నారు.

## ఎంఎస్ఎంఈలకు
# ఎక్కువ రుణాలివ్వాలి

- బ్యాంకులకు కేంద్ర మంత్రి జితన్‌రామ్ మాంఝీ సూచన
- ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలు చేయాలని పిలుపు
- పరిశ్రమలకు సాంకేతిక, ఆర్థిక సహాయం పెంచాలని ఆదేశం

**న్యూఢిల్లీ:** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధికి సంస్థాగత రుణాలను మరింతగా పెంచేలా బ్యాంకులు చొరవ చూపాలని కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి జితన్‌రామ్ మాంఝీ సూచించారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ఎంఎస్ఎంఈ రంగం వృద్ధికి అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పుదుచ్చేరిలో రెండు రోజుల పర్యటన సందర్భంగా కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ప్రధాన పథకాల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఎంఎస్ఎంఈలకు సాంకేతికత, సంస్థాగత రుణాలు, ఆర్థిక సహాయం, నైపుణ్యాభివృద్ధి, మార్కెట్ అవకాశాలు, నాణ్యమైన మౌలిక సదుపాయాలు మరింత విస్తృతంగా అందుబాటులోకి వచ్చేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో కేంద్ర మంత్రిత్వ శాఖ అధికారులు, పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధులు, డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్

ఆఫీస్, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ), కొయిర్ బోర్డు, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ), సిడ్బీ, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ), ఎంఎస్ఎంఈ సంఘాల ప్రతినిధులు, ఇతర భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### పథకాలపై అవగాహన పెంచాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న ఎంఎస్ఎంఈ పథకాలపై విస్తృత అవగాహన కల్పించి, వాటి వినియోగాన్ని మరింత పెంచాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. ఎంఎస్ఎంఈలకు బ్యాంకుల ద్వారా సంస్థాగత రుణాల లభ్యతను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అన్ని భాగస్వామ్య సంస్థలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి జితన్‌రామ్ మాంఝీ పునరుద్ఘాటించారు.

## 64 వేల ఎకరాల
# వివరాలు వెల్లడించండి

- సీఎం యోగికి అఖిలేశ్ యాదవ్ సవాల్
- జిల్లాల వారీగా భూముల జాబితా విడుదల చేయాలని డిమాండ్
- అయోధ్య, కుంభమేళా అంశాలనూ ప్రస్తావిస్తూ బీజేపీపై విమర్శలు

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 64 వేల ఎకరాల ఆక్రమిత భూములను విముక్తం చేశామన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రశ్నలు సంధించారు. ఆ భూములకు సంబంధించిన జిల్లా వారీ వివరాలు, సర్వే నంబర్లు, భూ రికార్డులను ప్రజల ముందుంచాలని ఆయన ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన అఖిలేశ్, ముఖ్యమంత్రి చేసిన ప్రకటనకు విశ్వసనీయత కల్పించాలంటే 64 వేల ఎకరాల భూముల పూర్తి జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెప్పే గణాంకాలపై ప్రజలకు నమ్మకం తగ్గిందని విమర్శించారు. అయోధ్య రామాలయంలో విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ) నివేదికను కూడా ఆయన ప్రశ్నించారు. ఆ వ్యవహారంలో వాస్తవాలను కప్పిపుచ్చేందుకే ఎస్ఐటీని ఏర్పాటు చేశారని ఆరోపించారు. అలాగే కుంభమేళా మరణాల సంఖ్య విషయంలో ప్రభుత్వం వెల్లడించిన

గణాంకాలు కూడా తప్పని తేలిన విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. మాటల్లో చెప్పే లెక్కలు ఒకలా, రికార్డుల్లో ఉండే లెక్కలు మరోలా ఉంటే ప్రజలు దేనిని నమ్మాలి అని అఖిలేశ్ ప్రశ్నించారు.

### ఆక్రమణలో ఉన్నవాటినే స్వాధీనం చేసుకున్నాం

కాగా, చిత్రకూట్‌లో బుధవారం రూ.951 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించిన సందర్భంగా సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ, 2017లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ప్రభుత్వ, వ్యాపారులు, పేదలకు చెందిన 64 వేల ఎకరాల భూములు అక్రమ ఆక్రమణలో ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గత సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వ హయాంలో పార్టీ జెండాలు ఏర్పాటు చేసి భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపించిన ఆయన, ప్రస్తుతం ఆ భూములపై విశ్వవిద్యాలయాలు, వైద్య కళాశాలలు, పెట్టుబడి ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

# వాట్సాప్ 'యూజర్‌నేమ్'పై కేంద్రం నిఘా

- ప్రభుత్వ నోటీసుకు మెటా సమాధానం.. పరిశీలనలో ఐటీ శాఖ
- మోసాల ముప్పుపై ఆందోళన
- సంప్రదింపులు పూర్తయ్యే వరకూ ఫీచర్‌కు బ్రేక్
- టెలిగ్రామ్, సిగ్నల్ సంస్థల వివరణల కోసం కూడా ఎదురుచూపులు

**న్యూఢిల్లీ:** వాట్సాప్‌లో ప్రవేశపెట్టనున్న 'యూజర్ నేమ్' ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటీసుకు మెటా యాజమాన్యంలోని వాట్సాప్ తన వివరణను సమర్పించింది. ఈ సమాధానం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వశాఖ (ఐటీ శాఖ)కు చేరిందని, ప్రస్తుతం దానిపై సమగ్రంగా పరిశీలన కొనసాగుతోందని ప్రభుత్వ వర్గాలు గురువారం వెల్లడించాయి. ఫోన్ నంబర్‌ను వెల్లడించకుండా యూజర్‌నేమ్ ద్వారా సందేశాలు పంపుకునే ఈ ఫీచర్ అమలులోకి వస్తే ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ మోసాలు, వ్యక్తుల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి మోసాలకు పాల్పడే ప్రమాదం పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల మెటాకు నోటీసు జారీ చేసింది. ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు భారత్‌లో ఈ ఫీచర్‌ను అమలు చేయవద్దని కూడా స్పష్టం చేసింది. దీనికి స్పందించిన వాట్సాప్ అదనపు గడువు కోరడంతో పాటు, ప్రభుత్వంతో చర్చలు ముగిసే వరకు భారత్‌లో 'యూజర్‌నేమ్' ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురాబోమని హామీ ఇచ్చింది. ఆ మేరకు గురువారం తన వివరణను ఐటీ శాఖకు సమర్పించింది. ఈ ఫీచర్ ప్రస్తుతం ఎక్కడా అమల్లో లేదని, ఈ ఏడాది చివర్లో దశలవారీగా ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు వాట్సాప్ తెలిపింది. ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, ధృవీకరించిన మెటా ఖాతాల పేర్లను దుర్వినియోగం కాకుండా రక్షించే ప్రత్యేక భద్రతా వ్యవస్థను రూపొందించినట్లు పేర్కొంది. అలాగే తొలిసారి సందేశం పంపే వ్యక్తి కొత్త ఖాతాదారుడా, కాంటాక్ట్‌లో ఉన్నాడా, పరస్పర గ్రూపులు ఉన్నాయా, వేరే దేశానికి చెందినవాడా వంటి వివరాలను వినియోగదారులకు ముందుగానే చూపించే భద్రతా ఏర్పాట్లు ఉంటాయని వెల్లడించింది. ఇదే అంశంపై కేంద్ర ప్రభుత్వం టెలిగ్రామ్, సిగ్నల్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. ఆయా సంస్థల నుంచి ఇంకా సమాధానాలు రావాల్సి ఉందని ఐటీ శాఖ తెలిపింది. వాట్సాప్ సమర్పించిన వివరణపై పరిశీలన పూర్తయిన అనంతరం తదుపరి చర్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

# అమర్‌నాథ్ యాత్రలో నేపాల్ భక్తుడి మృతి

- అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ కన్నుమూత
- మరో ఘటనలో ట్యాక్సీ ప్రమాదం.. నలుగురు యాత్రికులకు గాయాలు
- క్షతగాత్రుల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యుల వెల్లడి

**బనిహాల్/జమ్మూ:** అమర్‌నాథ్ యాత్రలో విషాదం చోటుచేసుకుంది. గుహ ఆలయ దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణంలో అస్వస్థతకు గురైన నేపాల్‌కు చెందిన ఓ భక్తుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మరోవైపు బనిహాల్‌లో జరిగిన ట్యాక్సీ ప్రమాదంలో నలుగురు యాత్రికులు స్వల్పంగా గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌లోని ఖాట్మండుకు చెందిన 61 ఏళ్ల కృష్ణదేవ్ ఠాకూర్ బాల్తాల్ మార్గంలో తిరుగు ప్రయాణం చేస్తుండగా బనిహాల్‌లోని నవ యుగ్ టన్నెల్ సమీపంలో ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే లాంబర్ యాత్రికుల శిబిరంలోని వైద్య కేంద్రానికి తరలించి, అక్కడి నుంచి బనిహాల్ ఉపజిల్లా ఆస్పత్రికి, అనంతరం అనంత్‌నాగ్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. మరో ఘటనలో బాల్తాల్ బేస్ క్యాంప్‌కు వెళ్తున్న యాత్రికులతో కూడిన ట్యాక్సీ బనిహాల్‌లో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో హర్యానా లోని ఫరీదాబాద్‌కు చెందిన వరేశ్ యాదవ్, ఉషాదేవి, ఉత్తరాఖండ్‌కు చెందిన నటాషా శర్మ, నేహార్కా స్వల్పంగా గాయపడ్డారు. వారిని పోలీసులు, అత్యవసర సిబ్బంది వెంటనే బనిహాల్ ఉపజిల్లా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. గాయపడిన నలుగురి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## టీఎంసీకి రాజీనామా చేసిన ముగ్గురికి రాజ్యసభ టికెట్లు

- మాజీ తృణమూల్ ఎంపీలు సుష్మితా దేవ్, సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరాయక్‌కు అవకాశం
- ఈ నెల 24న ఉప ఎన్నికలకు అభ్యర్థుల ప్రకటన

న్యూఢిల్లీ/కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)ను వీడి భారతీయ జనతా పార్టీలో (బీజేపీ) చేరిన కొద్ది గంటల్లోనే ముగ్గురు మాజీ రాజ్యసభ సభ్యులకు కమలం పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. జూలై 24న జరగనున్న పశ్చిమ బెంగాల్ రాజ్యసభ ఉప ఎన్నికలకు సుష్మితా దేవ్, సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరాయక్‌లను అభ్యర్థులుగా గురువారం ప్రకటించింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓటమి అనంతరం పార్టీ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఈ ముగ్గురు నేతలు జూన్‌లో రాజ్యసభ సభ్యత్వంతో పాటు తృణమూల్‌కు రాజీనామా చేశారు. ఇటీవల ఎన్నికల సంఘం ఉప ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగా, గురువారం కోల్‌కతాలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్య సమక్షంలో వారు కమలం పార్టీలో చేరారు. వారిని పార్టీలో చేర్చుకున్న కొద్ది గంటల్లోనే బీజేపీ రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించడం రాజకీ యంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో ఈ మూడు రాజ్యసభ స్థానాలనూ గెలుచుకుంటామనే ధీమాను బీజేపీ వ్యక్తం చేసింది. రాజ్యసభ ఉప ఎన్నికలకు జూలై 24న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరాయక్‌ల పదవీకాలం 2029 సెప్టెంబర్ వరకు, సుష్మితా దేవ్ పదవీకాలం 2030 ఏప్రిల్ వరకు ఉండాల్సి ఉంది. వారి రాజీనామాలతో ఈ స్థానాలు ఖాళీ అయ్యాయి.

# పోరాడి గెలిచారు

## వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్ విజేతగా అరెవాలో–ఒస్టాపెంకో

- తొలి గ్రాండ్‌స్లామ్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌తో చరిత్ర సృష్టించిన రెండో సీడ్ జోడీ
- హంటర్–పోల్మాన్స్‌పై మూడు సెట్లలో అద్భుత విజయం



**లండన్:** ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రెండో సీడ్ జోడీ మార్సెలో అరెవాలో–జెలెనా ఒస్టాపెంకో విజేతగా నిలిచింది. గురువారం సెంటర్ కోర్టులో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో ఆస్ట్రేలియా జోడీ స్టోర్మ్ హంటర్–మార్క్ పోల్మాన్స్‌ను 4–6, 7–5, 6–2తో ఓడించి తొలి గ్రాండ్‌స్లామ్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌తో పాటు తొలి వింబుల్డన్ కిరీటాన్ని సొంతం చేసుకుంది. తొలి సెట్‌ను కోల్పోయిన అరెవాలో–ఒస్టాపెంకో జోడీ రెండో సెట్‌లోనూ ఒక దశలో బ్రేక్‌తో వెనుకబడింది. అయితే ఒత్తిడిని అధిగమిస్తూ అసాధారణ పోరాట పటిమ ప్రదర్శించి రెండో సెట్‌ను కైవసం చేసుకుంది. అనంతరం నిర్ణయాత్మక మూడో సెట్‌లో పూర్తి ఆధిపత్యం చెలాయించి గంటా 56 నిమిషాల పాటు సాగిన ఫైనల్‌ను విజయవంతంగా ముగించింది. విజయం అనంతరం ఒస్టాపెంకో మాట్లాడుతూ.. రెండో సెట్‌లో వెనుకబడినప్పటికీ చివరి పాయింట్ వరకు పోరాడాలనే సంకల్పంతోనే బరిలో నిలిచామని తెలిపింది. అరెవాలో ఎప్పుడూ సానుకూల దృక్పథంతో జట్టును ముందుకు నడిపించాడని, అతని ఆత్మవిశ్వాసమే విజయానికి ప్రధాన బలమైందని పేర్కొంది. ఈ విజయంతో ఒస్టాపెంకో ఖాతాలో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేరింది. అంతకుముందు 2017 ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్, 2024 యూఎస్ ఓపెన్ మహిళల డబుల్స్ టైటిళ్లను ఆమె గెలుచుకుంది.

### తొలి ఎల్ సాల్వడార్ క్రీడాకారుడిగా అరెవాలో

మరోవైపు అరెవాలోకు ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కాగా, వింబుల్డన్‌లో ఛాంపియన్‌గా నిలిచిన తొలి ఎల్ సాల్వడార్ క్రీడాకారుడిగా చరిత్ర సృష్టించాడు. తన దేశంలో టెన్నిస్‌కు పెద్దగా గుర్తింపు లేకపోయినా, కృషి, పట్టుదలతో అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని ఈ విజయం నిరూపించిందని వ్యాఖ్యానించాడు. ఫైనల్లో ఓటమిపాలైన పోల్మాన్స్ ప్రేక్షకుల మద్దతుకు కృతజ్ఞతలు తెలుపుతూ, అరెవాలో–ఒస్టాపెంకో జోడీ అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించిందని అభినందించాడు. ఫైనల్ అనుభవం చిరస్మరణీయంగా నిలుస్తుందన్నాడు.

# భారత్‌కు షాక్!

- వరుసగా రెండో టీ20 సిరీస్ కోల్పోయిన టీమిండియా
- నాలుగో టీ20లో ఆతిథ్య ఇంగ్లండ్ 9 వికెట్ల విజయం

**బ్రిస్టల్:** వరుస పరాజయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న టీమిండియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. గురువారం జరిగిన నాలుగో టీ20లో ఇంగ్లండ్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3–0తో కైవసం చేసుకుంది. వర్షం కారణంగా తొలి మ్యాచ్ రద్దు కాగా, మిగిలిన మూడు మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓటమిపాలైంది. శ్రేయస్ అయ్యర్ అజేయంగా 80 పరుగులతో పోరాడినా, మిగతా బ్యాటర్లు విఫలమవడంతో భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 158 పరుగులకే పరిమితమైంది. అనంతరం ఇంగ్లండ్ కేవలం 13.5 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. భారత్ నిర్దేశించిన 159 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే జోస్ బట్లర్ వికెట్ కోల్పోయినా, అక్కడి నుంచి హ్యారీ బ్రూక్, ఫిల్ సాల్ట్ భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. బ్రూక్ కేవలం 35 బంతుల్లోనే 79 పరుగులతో (8 ఫోర్లు, 4 సిక్సర్లు) అజేయంగా నిలవగా, సాల్ట్ 42 బంతుల్లో 59 పరుగులు (9 ఫోర్లు, 1 సిక్సర్) చేసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఇద్దరూ రెండో వికెట్‌కు అజేయ భాగస్వామ్యంతో భారత్‌కు అవకాశమే ఇవ్వలేదు.

### ఆరంభంలోనే ఎదురుదెబ్బ

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. వైభవ్ సూర్యవంశీ (15), ఇషాన్ కిషన్ (4), అభిషేక్ శర్మ (16) త్వరగా పెవిలియన్ చేరడంతో స్కోరు ఒత్తిడిలో పడింది. ఈ పరిస్థితుల్లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఓపికగా ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. శివమ్ దూబేతో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన అయ్యర్ చివరి ఓవర్లలో వేగం పెంచి 49 బంతుల్లో 80 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, ఐదు భారీ సిక్సర్లు ఉన్నాయి. దూబే 22, తిలక్ వర్మ 11 పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 2 వికెట్లు తీసి మరోసారి భారత టాప్‌ఆర్డర్‌ను దెబ్బతీశాడు. జోష్ టంగ్ కూడా రెండు వికెట్లు పడగొట్టగా, ఆదిల్ రషీద్ కీలక సమయంలో అభిషేక్ శర్మను ఔట్ చేసి భారత్‌ను కట్టడి చేశాడు. చివరి రెండు ఓవర్లలో ఇంగ్లండ్ బౌలర్లు కేవలం 12 పరుగులే ఇవ్వడంతో భారత్ భారీ స్కోరు చేయలేకపోయింది.

# ముచోవా చరిత్ర సృష్టించేనా?

- నేడు వింబుల్డన్‌లో మహిళల సింగిల్స్ ఫైనల్
- తుదిపోరులో తలపడనున్న ముచోవా–నోస్కోవా
- వరుసగా మూడోసారి చెక్‌కే ఖాయమైన కిరీటం

**లండన్:** ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ టెన్నిస్ టోర్నీలో చెక్ రిపబ్లిక్ మహిళల ఆధిపత్యం మరోసారి స్పష్టమైంది. మహిళల సింగిల్స్ ఫైనల్‌కు కరోలినా ముచోవా, లిండా నోస్కోవా చేరుకోవడంతో ఈ ఏడాది కూడా వింబుల్డన్ కిరీటం చెక్ క్రీడాకారిణినే వరించనుంది. దీంతో గత నాలుగేళ్లలో మూడోసారి, వరుసగా మూడో ఏడాది చెక్ మహిళే ఛాంపియన్‌గా నిలవడం ఖాయమైంది. ఇప్పుడు అందరి దృష్టి కరోలినా ముచోవాపైనే నిలిచింది. ఇప్పటికే గ్రాండ్‌స్లామ్ ఫైనల్ అనుభవం ఉన్న ఆమె విజేతగా నిలిస్తే చెక్ మహిళల ఘన వారసత్వాన్ని మరోసారి నిలబెట్టిన ఆటగాళ్ల జాబితాలో తన పేరును చిరస్థాయిగా లిఖించుకోనుంది. మరోవైపు యువ సంచలనం లిండా నోస్కోవా తొలి వింబుల్డన్ ఫైనల్‌లోనే టైటిల్ గెలిచి కొత్త చరిత్ర సృష్టించాలనే పట్టుదలతో ఉంది. సెమీఫైనల్లో నోస్కోవా వరుస సెట్లలో మార్తా కోస్ట్యుక్‌ను ఓడించి కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ ఫైనల్‌లో అడుగుపెట్టింది. మరో సెమీఫైనల్లో ముచోవా ఉత్కంఠభరిత పోరులో కోకో గాఫ్‌ను మూడో సెట్ టైబ్రేక్‌లో మట్టికరిపించి తుది సమరానికి చేరుకుంది. దీంతో శనివారం జరిగే ఫైనల్లో చెక్ ఆటగాళ్ల మధ్యే ప్రతిష్ఠాత్మక టైటిల్ పోరు జరగనుంది.

### 2023 నుంచి ఇలా..

వింబుల్డన్‌లో చెక్ మహిళల విజయగాథకు ప్రత్యేక స్థానం ఉంది. 2023లో మార్కెటా వోండ్రోసోవా, 2024లో బార్బోరా క్రెజ్‌చికోవా ఛాంపియన్లుగా నిలిచిన తర్వాత ఇప్పుడు మరోసారి అదే దేశానికి చెందిన క్రీడాకారిణి ట్రోఫీని అందుకోనుంది. గడ్డి కోర్టులపై నైపుణ్యం, బలమైన శిక్షణ వ్యవస్థ, తరతరాలుగా కొనసాగుతున్న టెన్నిస్ సంస్కృతే ఈ విజయాల వెనుక ప్రధాన కారణాలుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముచోవా మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే తనకంటే సీనియర్ చెక్ క్రీడాకారిణుల విజయాలు తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయని తెలిపింది. నోస్కోవా మాత్రం 2011లో పెట్రా క్విటోవా వింబుల్డన్ టైటిల్ గెలిచిన మ్యాచ్‌ను చూసిన తర్వాతే టెన్నిస్‌పై ఆసక్తి పెరిగిందని వెల్లడించింది. గడ్డి కోర్టులపై సృజనాత్మక ఆటతీరును ప్రదర్శించడం చెక్ క్రీడాకారిణుల ప్రత్యేకత అని పేర్కొంది. చెక్ టెన్నిస్ దిగ్గజం మార్టినా నవరతిలోవా కూడా ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేసింది. శనివారం ఎవరు గెలిచినా చెక్ క్రీడాకారిణే విజేత అవుతుంది. అందుకే మ్యాచ్‌ను ప్రశాంతంగా ఆస్వాదించగలను. వింబుల్డన్‌లో చెక్ మహిళల ప్రదర్శన అసాధారణం అని వ్యాఖ్యానించింది. ముచోవా, నోస్కోవా మంచి స్నేహితులు కావడం ఈ ఫైనల్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో డబుల్స్ జోడీగా బరిలోకి దిగిన వీరిద్దరూ.. ఇప్పుడు వింబుల్డన్ సింగిల్స్ కిరీటం కోసం ఒకరినొకరు ఢీకొననున్నారు. ప్రపంచ 9వ ర్యాంకర్ ముచోవాకు ఇది రెండో గ్రాండ్‌స్లామ్ ఫైనల్ కాగా, 21 ఏళ్ల నోస్కోవా తొలి వింబుల్డన్ ఫైనల్‌తోనే కొత్త చరిత్ర సృష్టించే అవకాశాన్ని అందిపుచ్చుకుంది. అయితే ఈ పోరులో విజయం ఎవరిదైనా.. చెక్ మహిళలదే ట్రోఫీ కావడం ఖాయం.

## లార్డ్స్‌లో గెలుపే మా లక్ష్యం

- టీమిండియా మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్

**లండన్:** ఇంగ్లండ్‌తో శుక్రవారం ప్రారంభమయ్యే చారిత్రక లార్డ్స్ టెస్టులో విజయం సాధించడమే తమ ఏకైక లక్ష్యమని భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ స్పష్టం చేసింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే టీ20 ప్రపంచకప్‌లో ఎదురైన నిరాశ నుంచి పూర్తిగా బయటపడటమే కాకుండా జట్టులో ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతుందని ఆమె పేర్కొంది. లార్డ్స్ వంటి చారిత్రక వేదికపై విజయం భారత మహిళల క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అభిప్రాయపడింది. టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్ దశలోనే నిష్క్రమించడం జట్టును తీవ్రంగా నిరాశపరిచిందని హర్మన్‌ప్రీత్ అంగీకరించింది. కొన్ని మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేసినప్పటికీ, జట్టుగా ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయామని చెప్పింది. అయితే లార్డ్స్ టెస్టులో విజయంతో ఆ వైఫల్యాన్ని వెనక్కి నెట్టి, మళ్లీ ప్రపంచంలోని అత్యుత్తమ జట్లలో ఒకటిగా నిలిచే ఆత్మవిశ్వాసాన్ని సొంతం చేసుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపింది.

# జీసీసీల్లో ప్రపంచ నాయకత్వమే లక్ష్యం

- ప్రపంచ నాలెడ్జ్ ఎకానమీలో భారత్‌ను కీలక శక్తిగా తీర్చిదిద్దాలి
- దేశంలో 2,100కు పైగా జీసీసీలు.. 23 లక్షల మందికి ఉపాధి
- టియర్–2, టియర్–3 నగరాలను జీసీసీ పెట్టుబడులకు సిద్ధం చేయాలి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ:** బహుళజాతి సంస్థల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటులో భారత్ కేవలం ఆతిథ్య దేశంగా మాత్రమే కాకుండా, ప్రపంచానికి వ్యూహాత్మక నాయకత్వం వహించే స్థాయికి ఎదగాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రపంచ నాలెడ్జ్ ఎకానమీలో భారత్‌ను అనివార్యమైన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. గురువారం సీఐఐ నిర్వహించిన జీసీసీ బిజినెస్ సమ్మిట్–2026లో మాట్లాడిన మంత్రి, 2024లో వారానికి ఒక కొత్త జీసీసీ ఏర్పడుతుండగా, ప్రస్తుతం దేశంలో సగటున ప్రతిరోజూ ఒక జీసీసీ ప్రారంభమవుతోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న జీసీసీల్లో సగానికి పైగా ప్రస్తుతం భారత్‌లోనే ఉన్నాయని చెప్పారు. జీసీసీల సంఖ్య పెరగడం మాత్రమే విజయానికి కొలమానం కాదని, భవిష్యత్ సాంకేతికతలు, కొత్త ఉత్పత్తులు, వ్యాపార వ్యూహాలు భారత్ నుంచే రూపుదిద్దుకునేలా చేయడమే తదుపరి లక్ష్యమని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు, సాంకేతిక అభివృద్ధికి నాయకత్వం వహించే సామర్థ్యం భారత్‌కు ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో 2,100కు పైగా జీసీసీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, వాటి ద్వారా 23లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తోందని తెలిపారు. ఈ కేంద్రాలు ఏటా దాదాపు 100 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సమకూరుస్తున్నాయని చెప్పారు. తక్కువ వ్యయంతో సేవలందించే దేశం నుంచి సామర్థ్యానికి నాయకత్వం వహించే దేశంగా భారత్ పరిణామం చెందిందని పేర్కొన్నారు.

### ఫార్చ్యూన్ కంపెనీల్లో భారీ అవకాశం

ప్రపంచంలోని ఫార్చ్యూన్ గ్లోబల్–2000 కంపెనీల్లో దాదాపు మూడింట రెండొంతుల సంస్థలు ఇంకా భారత్‌లో జీసీసీలు ఏర్పాటు చేయలేదని, ఇది దేశానికి పెద్ద పెట్టుబడి అవకాశమని మంత్రి అన్నారు. భారత జీసీసీలు ఖర్చు తగ్గింపుకే పరిమితం కాకుండా ఆవిష్కరణలు, పరిశోధనలు, కృత్రిమ మేధ (ఏఐ), ప్రపంచ స్థాయి వ్యూహాత్మక నిర్ణయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. జీసీసీల తదుపరి విస్తరణకు అనుకూలమైన విధానాలను ప్రభుత్వం రూపొందిస్తోందని, 2026–27 కేంద్ర బడ్జెట్‌లో ఇందుకు సంబంధించిన పలు చర్యలు ప్రకటించినట్లు తెలిపారు. పరిశ్రమలు రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, స్థానిక సమాజాలతో కలిసి టియర్–2, టియర్–3 నగరాలను జీసీసీ పెట్టుబడులకు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే మేధో సంపత్తి, పరిశోధనలు, ఏఐ ఆధారిత పరిష్కారాలు, ప్రపంచ స్థాయి ఆవిష్కరణలపై మరింత దృష్టి సారించి, ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసిన సాంకేతికతను వేగంగా మార్కెట్‌కు తీసుకురావాలని పరిశ్రమలకు పిలుపునిచ్చారు.

# Business
# బిజినెస్

## ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ రుణాల కేసులో చార్జిషీట్

- రూ.3,526 కోట్ల బ్యాంకు నష్టంపై తొలి చార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ

**న్యూఢిల్లీ:** రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్) రుణాల మళ్లింపు కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తొలి చార్జిషీట్‌ను గురువారం ముంబై ప్రత్యేక కోర్టులో దాఖలు చేసింది. నిధుల దుర్వినియోగం కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ. 3,526.35 కోట్ల నష్టం వాటిల్లిందని సీబీఐ పేర్కొంది. ఈ కేసులో ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌తో పాటు సంస్థ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ రవీంద్ర సుధాల్కర్, మాజీ చీఫ్ రిస్క్ ఆఫీసర్ కృష్ణన్ గోపాలకృష్ణన్ అయ్యర్, రిలయన్స్ క్యాపిటల్ మాజీ చీఫ్ క్రెడిట్ అండ్ రిస్క్ ఆఫీసర్ ధనంజయ్ భగవాన్‌ప్రసాద్ తివారీలను నిందితులుగా చేర్చింది. నేరపూరిత కుట్ర, మోసం తదితర అభియోగాలను నమోదు చేసింది. సీబీఐ దర్యాప్తులో బ్యాంకుల నుంచి రుణంగా తీసుకున్న నిధులను మధ్యవర్తి సంస్థల ద్వారా రిలయన్స్ ఏడీఏ గ్రూప్‌కు చెందిన ఇతర కంపెనీలకు మళ్లించినట్లు తెలిపింది. రుణ ఒప్పంద నిబంధనలను ఉల్లంఘిస్తూ నిధులను మళ్లించడం వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకులకు భారీ నష్టం, సంబంధిత సంస్థలకు అక్రమ లాభం చేకూరినట్లు పేర్కొంది.

### బ్యాంకుల కన్సార్టియం ఫిర్యాదుల ఆధారంగా..

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా 10 ప్రభుత్వ రంగ బ్యాంకుల కన్సార్టియం ఫిర్యాదుల ఆధారంగా ఈ కేసు నమోదు చేసినట్లు సీబీఐ వెల్లడించింది. ఈ కేసులో ఇతర డైరెక్టర్లు, సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగుల పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేసే అవకాశం ఉందని తెలిపింది. ఇప్పటికే ఈ కేసులో రవీంద్ర సుధాల్కర్, ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్ మాజీ డైరెక్టర్ అమిత్ బాప్నాలను సీబీఐ అరెస్టు చేయగా, ఇద్దరూ ప్రస్తుతం న్యాయస్థాన కస్టడీలో ఉన్నారు. రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ టెలికాం సంస్థలకు సంబంధించిన మరికొన్ని కేసులపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

## బైక్ ట్యాక్సీలపై ఇక రోజువారీ రుసుము

- అక్రమంగా నడుస్తున్న వాటికి కొత్త నిబంధనలు

**ముంబై:** మహారాష్ట్రలో ప్రస్తుతం అక్రమంగా నడుస్తున్న బైక్ ట్యాక్సీ సేవలపై రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా రోజువారీ రుసుము విధించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ బైక్ ట్యాక్సీ విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే వరకు ఈ నిబంధనలు కొనసాగనున్నట్లు రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ గురువారం తెలిపారు. ఆగస్టు 1 నుంచి అక్రమంగా సేవలు అందిస్తున్న బైక్ ట్యాక్సీ నిర్వాహకులు రోజుకు రూ.5 రుసుముతో పాటు, తమ ఆదాయంలో 2 శాతం సంక్షేమ నిధికి చెల్లించాల్సి ఉంటుందని మంత్రి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనను రాష్ట్ర న్యాయ, న్యాయవ్యవహారాల శాఖ ఆమోదం కోసం పంపించినట్లు చెప్పారు. ఎలక్ట్రిక్ బైక్ ట్యాక్సీ విధానం రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన తర్వాత ఈ తాత్కాలిక విధానాన్ని ఉపసంహరించుకుంటామని సర్నాయక్ స్పష్టం చేశారు.

## డీబీఎస్ బ్యాంక్ ఇండియా లాభాల్లో 49శాతం వృద్ధి

- 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.1,020 కోట్ల నికర లాభం
- రుణాల వృద్ధితో పాటు ఎన్‌పీఏలు గణనీయంగా తగ్గుదల
- మూలధన బలోపేతంతో ఆర్థిక స్థితి మరింత పటిష్టం

**న్యూఢిల్లీ:** డీబీఎస్ బ్యాంక్‌కు పూర్తిగా అనుబంధ సంస్థ అయిన డీబీఎస్ బ్యాంక్ ఇండియా 2025–26 ఆర్థిక సంవత్సరంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. ఈ ఏడాది మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ నికర లాభం 49 శాతం పెరిగి రూ.1,020 కోట్లకు చేరినట్లు గురువారం వెల్లడించింది. బ్యాంకు ఆర్థిక పరిస్థితి మరింత బలోపేతం కావడంతో పాటు నిర్వహణ సామర్థ్యం మెరుగుపడటం, నాణ్యమైన వృద్ధిపై దృష్టి సారించడం వల్ల ఈ ఫలితాలు సాధ్యమైనట్లు బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రుణాల (అడ్వాన్సులు) వృద్ధి 15 శాతం నమోదైంది. అదే సమయంలో స్థూల నిరర్థక ఆస్తుల ((గ్రాస్ ఎన్‌పీఏ) శాతం 2.78 శాతం నుంచి 1.34 శాతానికి తగ్గింది. సమర్థవంతమైన రిస్క్ మేనేజ్‌మెంట్ కారణంగా ఆస్తుల నాణ్యత మరింత మెరుగుపడినట్లు బ్యాంకు తెలిపింది. 2026 మార్చిలో రూ.1,600 కోట్ల మూల ధనాన్ని సమకూర్చడంతో బ్యాంకు కాపిటల్ అడిక్వసీ రేషియో (సీఆర్‌ఏఆర్) 19.7 శాతానికి చేరింది. దీంతో బ్యాంకు ఆర్థిక పునాది మరింత బలపడిందని పేర్కొంది.

### వృద్ధి కొనసాగిస్తాం: రాజత్ వర్మ

గతేడాది కాలంలో ఆస్తుల నాణ్యత మెరుగుపడటం, వ్యయ నియంత్రణతో వ్యాపార వృద్ధి బలంగా కొనసాగిందని డీబీఎస్ బ్యాంక్ ఇండియా ఎండీ, సీఈఓ రాజత్ వర్మ తెలిపారు. విభిన్న వ్యాపార కార్యకలాపాల బలాన్ని ఉపయోగించుకొని వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు నాణ్యమైన వృద్ధిని కొనసాగిస్తామన్నారు.

## కోలుకున్న దేశీయ స్టాక్ మార్కెట్లు

- 238 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్.. 80 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ

**ముంబై:** గత ట్రేడింగ్ సెషన్‌లో భారీ పతనం తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కోలుకున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడుల (ఎఫ్ఐఐ) ప్రవాహం, ప్రపంచ మార్కెట్లలో సానుకూల ధోరణి కారణంగా సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో ముగిశాయి. అయితే అమెరికా–ఇరాన్ మధ్య వరుసగా రెండో రోజు కూడా దాడులు కొనసాగడంతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించినట్లు మార్కెట్ నిపుణులు తెలిపారు.30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 238.22 పాయింట్లు (0.31 శాతం) పెరిగి 76,741.82 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 823.05 పాయింట్లు ఎగబాకి 77,326.65ను తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 80.75 పాయింట్లు (0.34 శాతం) పెరిగి 23,962.80 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో సన్ ఫార్మా, భారతి ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడగా, ఇన్ఫోసిస్, మారుతి, ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. రూ.1,963 కోట్ల ఎఫ్ఐఐ పెట్టుబడులుఎక్స్చేంజీల గణాంకాల ప్రకారం బుధవారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.1,962.80 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 0.15 శాతం పెరిగి 78.14 డాలర్ల వద్ద ట్రేడైంది. ఇటీవలి పతనం తర్వాత మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి. ముఖ్యంగా రియాల్టీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు బలంగా పుంజుకున్నాయి. దక్షిణ కొరియా, జపాన్, చైనా మార్కెట్లు లాభాల్లో ముగియగా, హాంకాంగ్ మార్కెట్ నష్టపోయింది. యూరప్ మార్కెట్లు కూడా ఎక్కువగా సానుకూల ధోరణిలో ట్రేడవుతున్నాయి.భౌగోళిక ఉద్రిక్తతలపై నజర్‌మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో గత సెషన్‌లో జరిగిన భారీ అమ్మకాల తర్వాత బేరసారాల కొనుగోళ్ల మార్కెట్లకు ఊతమిచ్చినప్పటికీ, అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు పెట్టుబడిదారుల సెంటిమెంట్‌పై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. కాగా బుధవారం సెన్సెక్స్ 1,677.12 పాయింట్లు, నిఫ్టీ 516.65 పాయింట్లు క్షీణించిన విషయం తెలిసిందే.

# హీరో వేటలో శేఖర్ కమ్ముల

టాలీవుడ్‌లో తనదైన క్లాస్, సెన్సిబుల్ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు శేఖర్ కమ్ముల, ఇటీవల ధనుష్‌తో తెరకెక్కించిన 'కుబేర' విజయానంతరం మరో కొత్త ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. దాదాపు ఏడాది పాటు శ్రమించి ఓ కొత్త కథను సిద్ధం చేసినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ చిత్రాన్ని ఏషియన్ సునీల్ నిర్మించనున్నట్లు సమాచారం. అయితే హీరో ఎంపిక మాత్రం ఇంకా ఖరారు కాలేదు. టాలీవుడ్ స్టార్, యంగ్ హీరోలు ఇప్పటికే వరుస చిత్రాలతో బిజీగా ఉండటంతో, పలువురు నటులకు కథ వినిపించేందుకు శేఖర్ కమ్ముల సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే ఇతర భాషల హీరోలను కూడా సంప్రదించే ఆలోచనలో ఉన్నారని సమాచారం. శేఖర్ కమ్ముల తన సినిమాలను ఎంతో పర్ఫెక్షన్‌తో తెరకెక్కించే దర్శకుడిగా పేరొందారు. షూటింగ్‌కు ఎక్కువ సమయం కేటాయిస్తూ, రాజీ పడకుండా పని

చేయడం ఆయన ప్రత్యేకత. అందుకే ఆయనతో సినిమా చేసే హీరో దాదాపు ఏడాది పాటు ఈ ప్రాజెక్ట్‌కే సమయం కేటాయించాల్సి ఉంటుంది. ఈ ప్రతిష్టాత్మక అవకాశాన్ని చివరికి ఏ హీరో దక్కించుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# 'రాకా'కు ప్రీతీ నో!

ప్రస్తుతం ఇండియన్ సినిమా దగ్గర నుంచి రాబోతున్న పలు బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ లలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా దీపికా పదుకోణ్ హీరోయిన్ గా కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం "రాకా" కూడా ఒకటి. ఎన్నో అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమాలో రీసెంట్ సూపర్ హిట్ చిత్రం "బ్లాస్ట్" బ్యూటీ ప్రీతీ ముకుందన్ కూడా నటించాల్సి ఉందట. తెలుగులో కన్నప్ప సినిమాలో మెరిసిన ఈ బ్యూటీ "బ్లాస్ట్" సినిమాతోనే మరింత చేరువ అయ్యింది. అందంతో పాటుగా యాక్షన్ కూడా చేసి సర్ప్రైజ్ చేసిన ప్రీతీ ముకుందన్ ని తన రాకా సినిమా కోసం అప్రోచ్ అయ్యానని కానీ ఆమెకి ఉన్న బిజీ షెడ్యూల్ వల్ల కుదరలేదు అని స్వయంగా అట్లీ తెలిపాడు. లేటెస్ట్ గా జరిగిన 'ఇదయమ్ మురళీ' సినిమా ఈవెంట్ కి గెస్ట్ గా వెళ్లిన అట్లీ ఈ విషయాన్ని షేర్ చేసుకోగా ప్రీతి రోల్ ని ఫెమినా జార్జ్ ఆమె ప్లేస్ లోకి వచ్చింది. ఇక ఇదయమ్ మురళీ సినిమాలో అథర్వ హీరోగా నటించగా కయాదు లోహర్, ఫహద్ ఫాజిల్ లాంటి స్టార్స్ కూడా ఉన్నారు. అలాగే ఆకాష్ భాస్కరన్ దర్శకత్వం వహించారు.

# త్రిశూలంతో సిద్ధార్థ్!

బాలీవుడ్ స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా, స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం 'వాన్ – ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. జానపద కథల నేపథ్యంలో రూపొందుతున్న ఈ విజువల్ స్పెక్టాకిలర్‌ను సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. రిలీజ్ డేట్‌తో పాటు విడుదల చేసిన కొత్త పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దట్టమైన అడవి నేపథ్యంలో రూపొందించిన పోస్టర్‌లో చేతిలో త్రిశూలం పట్టుకున్న యోధుడు, ఉగ్రరూపంలో ఉన్న పులి, దూసుకొస్తున్న ఎద్దు కనిపిస్తూ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. పోస్టర్‌లోని ఫాంటసీ ఎలిమెంట్స్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనున్నట్లు సంకేతాలు ఇస్తున్నాయి. ఈ చిత్రాన్ని దర్శకుడు దీపక్ కుమార్ మిశ్రా తెరకెక్కిస్తున్నారు. బాలాజీ మోషన్ పిక్చర్స్, టీవీఎఫ్ మోషన్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, అరుణభ్ కుమార్, నీరజ్ కొఠారి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాల్సిందే.

## నవీన్ పోలిశెట్టి సినిమాకు తమిళ దర్శకుడు

ఈ సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు' చిత్రంతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు హీరో నవీన్ పొలిశెట్టి. ఇది ఆయన కెరీర్‌లో రూ.100కోట్ల వసూళ్లు సాధించిన తొలి సినిమాగా పేరు తెచ్చుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఆయనతో ఓ సినిమా చేయబోతున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే ఇప్పుడాయన తదుపరి చిత్రం కోసం ఓ తమిళ దర్శకుడితో చేతులు కలుపుతున్నట్లు తెలిసింది. 'సైరన్' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన ఆంటోని భాగ్యరాజ్‌తో తను కలిసి పని చేయనున్నట్లు సమాచారం. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రంపై స్పష్టత వచ్చే అవకాశముంది.

# ఎమోషనల్ రొమాంటిక్ డ్రామా.. హృదయం మురళి

కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి'. ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్–సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్‌తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా కనిపించడం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ బ్రీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.



# బాబీ దర్శకత్వంలో సిద్ధూ జొన్నలగడ్డ

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ సుకుమార్ వలం విజయవంతమైన సినిమాలు తెరకెక్కించడమే కాకుండా, ఇండస్ట్రీకి పలువురు ప్రతిభావంతులైన దర్శకులను అందించిన గురువుగా దా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన వద్ద శిష్యరికం చేసిన అనేక మంది దర్శకులు ప్రస్తుతం టాలీవుడ్‌లో తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తాజాగా ఆ జాబితాలోకి మరో కొత్త దర్శకుడు చేరనున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. సుకుమార్ సోదరుడి కుమారుడు బాబీ త్వరలో దర్శకుడిగా పరిచయం కానున్నారు. గత కొంతకాలంగా సుకుమార్ వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన బాబీ.. ఆయన సినిమాలతో పాటు పలు ప్రాజెక్ట్‌లలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు పూర్తి స్థాయి దర్శకుడిగా తన తొలి చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బాబీ దర్శకత్వంలో రూపొందనున్న తొలి చిత్రంలో యువ హీరో సిద్ధు జొన్నలగడ్డ నటించే అవకాశాలు ఉన్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటి కథను సిద్ధుకు వినిపించగా, ఆయనకు నచ్చడంతో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, సుకుమార్ క్యాంప్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడం, కథ దా నచ్చడంతో సిద్ధు ఈ సినిమాకు అంగీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సుకుమార్ వద్ద పనిచేసిన శిష్యుల తొలి చిత్రాలు ఎక్కువగా సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌లోనే రూపొందాయి. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ బాబీ తొలి సినిమాను దా సుకుమార్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# హృతిక్ నెక్ట్‌కు ఛావా డైరెక్టర్?

బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తికర ప్రచారం సాగుతోంది. ఇప్పటికే సౌత్ నుంచి ఓ క్రేజీ ప్రాజెక్ట్‌ను లైన్‌లో పెట్టుకున్న హృతిక్, ఇప్పుడు మరో భారీ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. ఈసారి రూ.800 కోట్లకు పైగా బాక్సాఫీస్ వసూళ్లు సాధించిన దర్శకుడితో ఆయన జతకట్టనున్నారనే వార్తలు బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.ఇటీవల విక్కీ కౌశల్ హీరోగా తెరకెక్కిన 'ఛావా' ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. హిందీలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ఈ చిత్రం తెలుగులోనూ మంచి ఆదరణ పొందింది. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన లక్ష్మణ్ ఉటేకర్‌తో హృతిక్ రోషన్ ఓ భారీ బడ్జెట్ చిత్రాన్ని చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు. ఈ క్రేజీ కాంబినేషన్ నిజమవుతుందా లేదా అన్నదానిపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# నితిన్‌కు జోడీగా వైష్ణవి!

టాలీవుడ్ యూత్ స్టార్ నితిన్ హీరోగా రూపొందుతున్న కొత్త సినిమాపై ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. తమ్ముడు తర్వాత కొంత విరామం తీసుకున్న నితిన్, దర్శక ద్వయం సోము–నర్రి దర్శకత్వంలో తన తదుపరి చిత్రాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇటీవల షూటింగ్ ప్రారంభం కాగా, సెట్స్ నుంచి లీక్‌ైన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ చిత్రంలో నితిన్ సాధారణ మధ్యతరగతి యువకుడి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. హీరోయిన్ ఎంపిక విషయంలో కూడా ఇప్పుడు స్పష్టత వచ్చినట్లు సమాచారం. తొలుత ఈ చిత్రంలో మిరాయ్ ఫేమ్ రితికా నాయక్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేసినప్పటికీ, ఆమె స్థానంలో బేబీ చిత్రంతో గుర్తింపు పొందిన వైష్ణవి చైతన్యను తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా లీక్‌ైన షూటింగ్ విజువల్స్‌లో నితిన్‌తో కలిసి వైష్ణవి చైతన్య కనిపించడంతో ఈ మార్పు దాదాపు ఖరారైనట్లేనని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత నాగ వంశీ నిర్మిస్తున్నారు. మిగతా నటీనటులు, విడుదల తేదీపై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# టాక్సిక్ నుంచి తబాహీ వీడియో సాంగ్ విడుదల

యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'టాక్సిక్' ఆగస్టు 26న విడుదల కానుండడంతో చిత్రబృందం ప్రచారం జోరు పెంచింది. ఈ చిత్రంలో యశ్‌కు జోడీగా ఐదుగురు హీరోయిన్లు నటించిన విషయం తెలిసిందే. వీరిలో నదియా పాత్రలో కియారా అద్వాణీ కనిపించనున్నారు. యశ్ – కియారా మధ్య వచ్చే 'తబాహీ' వీడియో సాంగ్‌ను తాజాగా విడుదల చేశారు. గతంలో ఈ పాట పోస్టర్‌తో చిత్రబృందం ఆడియో విడుదల చేసింది. కొన్ని రోజుల పాట, పోస్టర్‌పై విమర్శలు వచ్చాయి. కియారా దా ఈ పాటలోని బోల్డ్ సీన్స్ తగ్గించాలని రిక్వెస్ట్ చేశారంటూ వార్తలు వచ్చాయి. వీటిని ఆమె కొట్టిపారేసినప్పటికీ పాట మాత్రం హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా ఈ పాట పూర్తి వీడియోను టీవ్ పంచుకుంది (÷జీశిజీజీరతి లతిట!నీ బనీనిఐ). ఇప్పటి వర 'టాక్సిక్' నుంచి వచ్చిన అన్ని వీడియోల్లాగే ఇందులోనూ శృంగార సన్నివేశాలు ఉండడం మరోసారి చర్చకు దారితీస్తోంది. ఇక భారీ స్థాయిలో రానున్న ఈ చిత్రంలో హై–ఇంపాక్ట్ యాక్షన్ అవతార్‌లో యశ్ కనిపించనుండగా.. మునుపెన్నడూ చూడని పవర్‌ఫుల్ పాత్రల్లో అందాల భామలు నయనతార, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హ్యూమా ఖురేషీ ఆకట్టుకుంటున్నారు.

## బాలీవుడ్ ఎంట్రీ ఉందంటున్న నందినిరెడ్డి

సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' మంచి వసూళ్లు రాబట్టింది. దీంతో దర్శకురాలు నందినికి బాలీవుడ్ నుంచి అవకాశాలు వస్తున్నాయి. త్వరలో తాను బాలీవుడ్‌లోకి అడుగుపెట్టే అవకాశం ఉందని ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. రెండేళ్ల దిల్లీలో చదువుకున్నా. అప్పుడు చాలా హిందీ సినిమాలు చూసేదాన్ని. మంచి కథ కుదిరితే హిందీలో సినిమా చేస్తా. ఏ భాషలో చెప్పినా అది కథే కదా. త్వరలో ఒక డార్క్ సూపర్ నేచురల్ వెబ్‌సిరీస్ తీయబోతున్నా. అక్టోబర్‌లో షూటింగ్ మొదలుపెడతా. లైట్ హార్టెడ్ సినిమాల తర్వాత ఓటీటీలో కాస్త భిన్నంగా ప్రయత్నం చేస్తున్నానని తెలిపారు. తన తదుపరి ఫిల్మ్ 2027 ప్రారంభంలో ఉంటుందని వెల్లడించారు.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277